ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శుక్రవారం 10 జనవరి 2025

భక్తుల క్యూలైన్‌లోని రంగమండపంలో విద్యుత్‌ అలంకరణ



రోడ్లకు కొత్త సొబగులు

వైసీపీ పాలనలో అధ్వాన రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. వర్షం వచ్చిందంటే చాలు రోడ్లపై నీరు నిలిచి ఇది రోడ్డా.. చెరువా అన్నట్లు ఉండేది. ప్రధాన రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ఆ నీటి గుంతల్లో పడి ప్రమాదాలకు గురైన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇక పల్లెల్లో అయితే రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉండేది. అడుగడుగునా గుంతలతో ప్రజలు నరకయాతన అనుభవించేవారు. జగన్‌ సీఎంగా ఉన్న ఐదేళ్లు రోడ్లపైన తట్టెడు మట్టి కూడా పోయలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలోనే పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రధాన రోడ్లలో గుంతలు పూడ్చివేత కార్యక్రమాలు మొదలు పెట్టింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు : మదనపల్లె మండలం హౌసింగ్‌ కాలనీలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు



నేడు : హౌసింగ్‌ కాలనీలో సీసీ రోడ్డు వేశాక...



పెద్దమండ్యం మండలం విద్యానగర్‌ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

- సంక్రాంతికి పల్లెల్లో సీసీ రోడ్లతో నూతన శోభ
- తుది దశకు 'పల్లె పండుగ' రోడ్ల నిర్మాణం
- జిల్లాలో 14,460 మీటర్ల సీసీ రోడ్లు పూర్తి

మదనపల్లె టౌన్‌, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కనీస అభివృద్ధికి కూడా నోచుకోని పల్లెలు, కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనలో కొంగొత్త సీసీ రోడ్ల నిర్మాణాలతో నూతన శోభ సంతరించుకుంటున్నాయి. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ చెప్పినట్లే పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మారుమూల గ్రామాల్లో సైతం సంక్రాంతి పండుగ నాటికి సీసీ రోడ్ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. వీటితో పాటు మురుగునీటి కాలువలు, పశువుల షెడ్లు (మినీ గోకులాలు), బీటీ రోడ్లు, సిరికల్చర్‌ షెడ్లు, పాఠశాలల ప్రహరీల నిర్మాణాలు జోరందుకున్నాయి. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ప్రహరీలు, కంకర రోడ్ల నిర్మాణానికి రూ.63.83 కోట్ల నిధులు మంజూరు కాగా 60 శాతం పనులు పూర్తయ్యాయి. దీంతో ఏ పల్లెలో చూసినా కొత్త రోడ్ల సొబగులతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

పల్లెసీమలో సీసీ రోడ్ల నూతన సొబగులు

ఇన్నాళ్లు ఎగుడు దిగుడు మట్టి రోడ్లు, ప్రజలు నడిచేందుకు కూడా అవస్థలు పడ్డ రోడ్లు నేడు కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్లతో నూతన సొబగులు అద్దుకున్నాయి. రెండు నెలల క్రితం కలెక్టర్‌ చామకూరి శ్రీధర్‌ చొరవతో 30 మండలాల్లోను సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 841 పనుల్లో (812 సీసీ రోడ్లు, 10 బీటీ తారు రోడ్లు, 4 కంకర రోడ్లు, 5 పాఠశాలల ప్రహరీల నిర్మాణాలకు రూ.63.83 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు గ్రామాల్లో చురుకైన యువకులు, నాయకులను ఎంపిక చేసి, ఏజెన్సీలకు పనులు అప్పగించారు. వీటిలో మూడు మీటర్ల వెడల్పుతో 14.46 కిలోమీటర్ల పొడవైన సీసీ రోడ్ల నిర్మాణాన్ని ఏజెన్సీలు పూర్తి చేసి ప్రజలు ఉపయోగించుకునేలా అందుబాటులోకి తీసుకొచ్చాయి. 841 పనుల్లో 70రోజుల్లోనే 60శాతం పూర్తి చేసుకుని తుది దశకు చేరుకున్నాయి. సంక్రాంతికి ఈ పనులు 100 శాతం పూర్తి కావాల్సి ఉండగా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో కొన్ని అనివార్య కారణాల వలన ఈ పనులు నెమ్మదించాయి. వైసీపీ పాలనలో సీసీ రోడ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఇంతవరకు బిల్లులు పడలేదంటే అతిశయోక్తి కాదు. కానీ కూటమి ప్రభుత్వ పాలనలో పనులు చేసిన ప్రతి ఒక్కరికీ బిల్లులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయంటే అది నిజంగా కాంట్రాక్టర్లకు భరోసా ఇస్తోంది.

నెలాఖరుకు 100 శాతం పూర్తి చేస్తాం..

జిల్లాలో ఇప్పటి వరకు 552 చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశాము. బీటీ రోడ్ల పనుల్లో కూడా వేగం పెంచుతున్నాము. ప్రహరీ గోడల నిర్మాణాలు పూర్తి చేస్తున్నాము. కొన్నిచోట్ల ఏజెన్సీల వలన నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. ఈనెలాఖరుకు జిల్లాలో 100 శాతం సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం.

- దయాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌, పంచాయతీరాజ్‌ శాఖ, రాయచోటి

పశువులకు నీడనిస్తున్న మినీ గోకులాలు

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు మురుగునీటి కాలువల నిర్మాణాలు, పశువులు, గొర్రెలకు నీడనిచ్చే మినీ గోకులాల నిర్మాణాలు కూడా ఉపాధి హామీ పథకంలో పరుగులు తీస్తున్నాయి. ఈ పథకంలో పాడి రైతులకు ఎక్కువ శాతం సబ్సిడీ ఇస్తుండటంతో ప్రతి గ్రామంలో కూడా మినీ గోకులాలు వెలుస్తూనే ఉన్నాయి. జిల్లాలో 1108 మినీ గోకులాలు మంజూరు కాగా వీటిలో 95 చదును పనులు, 280 పునాదుల నిర్మాణాలు కాగా 222 మినీ గోకులాలు రూఫ్‌ లెవెల్‌లో ఉన్నాయి. 511 మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి కాగా అవన్నీ ఉపయోగంలో ఉన్నాయి. వీటికి తోడు వ్యవసాయ భూముల్లో ఫారం పాండ్స్‌ (నీటి కొలనులు) 1319 మంజూరు కాగా 381 ఫారంపాండ్స్‌ 50 శాతం, 151 ఫారంపాండ్స్‌ 100 శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. అలాగే ఇళ్లపై కురిసే వర్షపు నీటిని ఒడిసి పట్టి నిల్వ చేయడానికి రూఫ్‌ టాప్‌ వాటర్‌ హార్వెస్టింగ్‌ పనులు 322 పనులు పూర్తయ్యాయి.



పెద్దమండ్యం మండలం బండమీదపల్లెలో రైతు నిర్మించిన మినీ గోకులం

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

- విద్యుద్దీపాలంకరణలో కోదండరామాలయం

ఒంటిమిట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కోదండరామాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ రకాల పూలతో, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామి వారి దర్శనానికి వెళ్లే దారిలో ప్రత్యేకంగా భక్తులను ఆకర్షించే విధంగా పూల అలంకరణ చేపట్టారు. భక్తుల కోసం రామాలయం చుట్టు ఉన్న అలంకార మండపంలో ప్రత్యేక క్యూలైనును ఏర్పాటు చేసి లైటింగ్‌ సదుపాయాన్ని కల్పించారు. వీటితో పాటు క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము 4.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. పెద్దఎత్తున భక్తులు రామాలయానికి విచ్చేయనున్న నేపథ్యంలో సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులకు పెద్దఎత్తున అన్నదానం

కోదండరామాలయానికి వచ్చే భక్తుల కోసం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన సత్రంలో ఉదయం నుంచి భక్తులకు అన్నదానం చేయాలని టీటీడీ నిర్ణయించింది. వీటితో పాటు దాతల సహాయంతో రామాలయంలో ప్రసాద విక్రయాలు చేపడతామన్నారు. రామాలయ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద చెక్క భజన కార్యక్రమాలను నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముస్తాబైన సౌమ్యనాథస్వామి ఆలయం



నందలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సౌ మ్యనాథ స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశికి ముస్తాబైంది. తూర్పు ద్వారం నుంచి ఏడు వైకుంఠ ద్వారాలతో స్వామివారి దర్శనం ఏర్పాట్లను టీటీడీ వారు పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్‌ దిలీప్‌కుమార్‌ తెలిపారు. స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సంక్రాంతికి 1,147 ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్‌, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ కడప జోన్‌ పరిధిలోని రాయలసీమ జిల్లాల్లోని డిపోల నుంచి సుమారు 1,147 ప్రత్యేక బస్సులను అధికారులు సిద్ధం చేశారు. ఇవి శుక్రవారం నుంచి 13వ తేదీ సోమవారం వరకు హైదరాబాద్‌, బెంగళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల నుంచి ఆయా జిల్లాలకు ప్రయాణికులను చేరవేయనున్నాయి. ఇందులో కడప రీజియన్‌ పరిధిలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల డిపోల నుంచి 294 బస్సులు ఏర్పాటుచేశారు. ఇందులో హైదరాబాద్‌ నుంచి కడప జిల్లాకు 111 బస్సులు, బెంగళూరు నుంచి 81, చెన్నై నుంచి 12, విజయవాడ నుంచి 25 బస్సులు తిరగనున్నాయి. వీటితో పాటు తిరుపతి, కర్నూలు, నెల్లూరు నుంచి మరో 65 బస్సులు తిరగనున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా నుంచి 60 బస్సులు ఏర్పాటుచేశారు. ఇందులో హైదరాబాద్‌ నుంచి అన్నమయ్య జిల్లాకు 9, బెంగళూరు నుంచి 42, చెన్నై నుంచి 2, విజయవాడ నుంచి 7 బస్సులు సిద్ధం చేశారు.

నంద్యాల జిల్లా పరిధిలో 112 బస్సులు, కర్నూలు జిల్లా నుంచి 170, తిరుపతి జిల్లా నుంచి 178, చిత్తూరు జిల్లా నుంచి 82, సత్యసాయి జిల్లా నుంచి 115, అనంతపురం జిల్లా నుంచి 136 బస్సులు కేటాయించారు. వీటితో పాటు బెంగళూరు నుంచి 56, చెన్నై నుంచి 2, విజయవాడ నుంచి 17, ఇతర ప్రాంతాల నుంచి మరో 6 బస్సులు ప్రయాణికుల కోసం కేటాయించారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సాగించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ కడప జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్‌ శ్రీధర్‌, ప్రజాప్రతినిధులు

- ఎంపీ మిథున్‌రెడ్డి

రాయచోటి (కలెక్టరేట్‌), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలని రాజంపేట పార్లమెంట్‌ సభ్యుడు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్‌ పీవీ మిథున్‌రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌ హాలులో కలెక్టర్‌ చామకూరి శ్రీధర్‌ ఆధ్వర్యంలో ఎంపీ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, చిత్తూరు, కడప జడ్పీ చైర్మన్‌లు శ్రీనివాసులు, శారద హాజరయ్యారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఉపయోగపడే పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, మున్సిపల్‌ చైర్మన్లు, మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఫైళ్లు కదలడం లేదు

- మూలనపడ్డ దాదాపు 600 ఫైళ్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఆదాయం వచ్చే ఫైళ్లకే ప్రాధాన్యం
- సాధారణ రైతుల ఫైళ్లన్నీ పక్కనే..
- 22ఏ, డాటెడ్‌ ల్యాండ్‌, ఫ్రీహోల్డ్‌ ఫైల్స్‌ పట్టించుకునే అధికారే కరువు..

6

ఆవుల మందపై చిరుత దాడి

- భయాందోళనలో కనుగొండ అటవీ ప్రాంత ప్రజలు

ములకలచెరువు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీ ప్రాంతంలో చిరుత పులి దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం సాయంత్రం ఆవుల మందపై దాడి చేసి ఓ దూడను చంపి తినింది. మండలంలోని పెద్దపాళ్యం సమీపంలో ఉన్న జారుడుబండ వద్ద ఇటీవల మేకల మందపై దాడి చేసి మూడు మేకలను లాక్కెళ్లి రెండు మేకలను తీవ్రంగా గాయపరిచి, కాపరి పాళ్యం నరసింహులుపై దాడికి యత్నించిన విషయం విదితమే. తాజాగా గురువారం సాయంత్రం కనుగొండరాయస్వామి ఆలయం సమీపంలోని ఊటకుంట వద్ద మేస్తున్న ఆవుల మందపై దాడి చేసి దూడను చంపి తినింది. విషయం తెలుసుకున్న ఆవుల యజమాని ఊటకుంట వద్దకు వెళ్లి పరిశీలించగా కొంత భాగం దూడను తినేసింది. చిరుతపులి వరుసగా దాడులు చేస్తుండడంతో పశువులు, గొర్రెలు, మేకల కాపరులు భయపడిపోతున్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అడివి వైపు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు.

పది రోజుల్లోగా పశుగణన పూర్తి కావాలి

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న పశుగణన నమోదును ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ మదనపల్లె డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ సత్యనారాయణ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని గుట్టపాలెం, కె.రెడ్డివారిపల్లె, కలికిరి, పారపట్ల గ్రామాల్లో సర్వే విధానాలను తనిఖీ చేశారు. రైతుల ఇళ్లకు సర్వేకు సంబంధించిన లేబుల్‌లను అతికించారా లేదా అని పరిశీలించారు. ప్రతి రైతు కనీసం 10 నుంచి 50 సెంట్ల భూమిలో పశువుల కోసం నేపియర్‌ గడ్డిని పెంచాలని సూచించారు. త్వరలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మండలంలో 72 శాతం నమోదు పూర్తయ్యిందని స్థానిక ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్‌ వెంకటముని నాయుడు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ పశు సంవర్ధక సహాయకులు, పశు వైద్యులు పాల్గొన్నారు.



తలుపులకు అతికించిన సర్వే లేబుల్‌ను పరిశీలిస్తున్న డీడీ

ఏదీ సంక్రాంతి వైభవం..?

- ఇళ్ల ముందు కనిపించని రంగవల్లులు
- కానరాని గంగిరెద్దులు, హరిదాసులు
- నెలరోజుల నుంచి.. మూడురోజులకే పరిమితమైన వేడుకలు
- పల్లెల్లో కనిపించని సంక్రాంతి సంబరాలు

6



జాగ్రత్తలతో హెచ్‌ఎంపీ వైరస్‌ వ్యాప్తి నివారణ

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్‌ కొండయ్య




హెచ్‌ఎంపీ వైరస్‌ అవగాహన కరపత్రాలు విడుదల చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రాయచోటిటౌన్‌, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి జాగ్రత్తల ద్వారా హెచ్‌ఎంపీ వైరస్‌ వ్యాప్తిని నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ కొండయ్య, జిల్లా సర్వేలెన్స్‌ అధికారి డాక్టర్‌ రియాజ్‌బేగ్‌ తెలిపారు. గురువారం వారు రాయచోటి పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్‌ఎంపీ వైరస్‌ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యశాఖ అధికారులు చెప్పే సూచనలు, సలహాలు, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. 5 నుంచి 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన ఆరోగ్యవంతులపైన హ్యూమన్‌ మెటా న్యూమోవైరస్‌ ప్రభావం ఉండదన్నారు. 5 సంవత్సరాలలోపు చిన్న పిల్లలకు, వ్యాధి నిరోధక శక్తి లేని వారికి, దీర్ఘకాలిక రోగులకు, వయోవృద్ధుల్లో మాత్రమే ప్రబలే అవకాశం ఉందన్నారు. హెచ్‌ఎంపీవీ అనేది కొత్త వైరస్‌ కాదని, కొవిడ్‌లా ప్రమాదకరమైంది కాదని, ఇది సాధారణ వైరస్‌ మాత్రమేనని ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. వైరస్‌ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటీ బయోటిక్స్‌ మందులు పనిచేయవని, చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి పూర్తిగా రక్షణ పొందవచ్చునని వారు తెలియజేశారు. ప్రధానంగా ప్రజలు తరచుగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం, మంచినీటిని ఎక్కువగా తీసుకోవడం, తాజా పౌష్టికాహారం తీసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మార్కెట్‌లో తిరగకుండా ఉండాలన్నారు. అలాగే దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలని సూచించారు. అంతేగాక ముక్కు, కళ్లను తరచూ చేతులతో తాకడం, ఇతరులతో కరచాలనం చేయకూడదని, దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను పాఠశాలలకు పంపకూడదన్నారు. పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్నీ టీకాలను వేయించాలన్నారు. ఈ వైరస్‌ నివారణ కోసం ప్రత్యేకమైన చికిత్స ఏమీ అవసరం లేదని, చిన్నపాటి జాగ్రత్తలతో ఈ వ్యాధిని దూరంగా ఉండవచ్చునని వారు తెలియజేశారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- హరియాణ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ
- ఘనంగా అన్నమాచార్య సిల్వర్‌జూబ్లీ వేడుకలు



రాజంపేట/రాజంపేట టౌన్‌, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేటి యువకులు ఉద్యోగాల కోసం చేయి చాచకుండా అనేకమందికి ఉద్యోగాలు కల్పించగలిగే పారిశ్రామిక వేత్తలుగా కష్టపడి ఎదగాలని, ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత డబ్బు సంపాదించినా నైతిక విలువలు కోల్పోతే అన్నీ కోల్పోయినట్లేనని హరియాణ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ తెలిపారు. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్‌ జూబ్లీ ఉత్సవాలకు గురువారం రాత్రి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మహిళలు ఎక్కడ అభివృద్ధి చెందుతారో అక్కడ అన్నివిధాలుగా అభివృద్ధి చెందినట్లేనన్నారు. ప్రధానంగా ఎంతో వెనుకబడ్డ రాయలసీమలో అందునా ఓ మారుమూల రాజంపేటలో అన్నమాచార్యుని పేరిట ఏకంగా ఒక యూనివర్సిటీని నెలకొల్పి ఏడాదికి పది వేల మందికి ఉన్నత విద్యను బోధిస్తున్న అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి కృషి అభినందనీయమన్నారు. అన్నిదానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. నేటి నూతన టెక్నాలజీకి అనుగుణంగా ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నా తమ మాతృభూమి భారతదేశాన్ని మరువకుండా ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. బ్రహ్మానందం లాంటి గొప్ప హాస్యనటుడు మన తెలుగు రాష్ట్రాల్లో ఉండడం ఎంతో ఆనందదాయకమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నూతన విద్యా విధానానికి చేస్తున్న కృషి గేమ్‌ చేంజర్‌ లాంటిదని దీనివల్ల ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

కార్యక్రమంలో హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, సినీ హీరో కిరణ్‌ అబ్బవరం, రాజంపేట సబ్‌కలెక్టర్‌ నిదియాదేవి, హాస్యనటుడు ప్రదీప్‌కుమార్‌, ఎమ్మెల్సీ కె.శ్రీనాథ్‌చౌదరి, అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్‌ రామచంద్రారెడ్డి, వైస్‌ చైర్మన్‌ చొప్పా యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండారు దత్తాత్రేయను సత్కరిస్తున్న చొప్పా గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి, బ్రహ్మానందం, కిరణ్‌ అబ్బవరం తదితరులు

సంక్రాంతి సందెలో గొబ్బిళ్లో..
మమ్మేలు మాలక్ష్మీకి గొబ్బిళ్లో
నేడు మమ్మేలు మాలక్ష్మీకి గొబ్బిళ్లో
ముత్యాల ముగ్గున్న వాకిళ్లలోన
వసియించే మాసిరికి గొబ్బిళ్లో
మందారపూవన్నె పారాణిలోన
కొలువుదీరిన తల్లికి గొబ్బిళ్లో...

ఇలాంటి గొబ్బిళ్ల పాటలు నేటి సంక్రాంతి మాసంలో ఎక్కడా వినపడ్డం లేదు. సంక్రాంతి నెల ప్రారంభమై 20 రోజులు దాటుతున్నా గొబ్బిళ్ల పాటలు.. ఇంటిముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు.. గంగిరెద్దుల సవ్వళ్లు అసలే కనిపించ డంలేదు. సంక్రాంతి వైభవం ఏటికేడాది తగ్గిపోతూ వస్తోంది.

ఏదీ సంక్రాంతి వైభవం..?

- ఇళ్ల ముందు కనిపించని రంగవల్లులు
- కానరాని గంగిరెద్దులు, హరిదాసులు
- నెలరోజుల నుంచి.. మూడురోజులకే పరిమితమైన వేడుకలు
- పల్లెల్లో కనిపించని సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి వస్తున్నా ఇళ్లకు వేసుకోని రంగులు


ఇళ్లముందు వేయని ముగ్గులు

రాజంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది పల్లె సీమల్లో ఘనంగా జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి. దీనిని వాడుక భాషలో పెద్దపండుగగా పిలుస్తారు. మన సంస్కృతి సంప్రదాయాలకు ఈ పండుగ కొత్తశోభను తెస్తుంది. సంక్రాంతి వచ్చిందంటే పిల్లలకు పది రోజులు, యువతులు మహిళలకు నెలరోజుల పండుగ. యువకులకు ఏకంగా పక్షం రోజుల పండుగ. సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు 10 రోజులు సెలవులు ఇస్తారు. తాడాట, బొంగరాలు, గోలీల ఆటలు ఇలా ఎన్నో రకాల ఆటలాడుకుంటూ ఎంతో సరదాగా విద్యార్థులు గడిపేస్తారు. మహిళలు, యువతులైతే డిసెంబరు 15 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఈ పండుగను చేసుకుంటారు. తెల్లవారుజామునే ఇంటి ముంగిళ్లను శుభ్రం చేయడం, రంగురంగుల ముగ్గులు వేయడం, సంక్రాంతి తల్లిని ఆహ్వానిస్తూ ముగ్గులపై గొబ్బెమ్మ రూపంలో పేడ పెట్టి గుమ్మడిపూలతో అలంకరించడం చేస్తారు. నెలరోజుల పాటు సంక్రాంతి శోభను తెస్తారు.

యువతులందరూ ఒక్కటై గొబ్బెమ్మ పాటలతో నెలరోజుల పాటు ఊరందరిని అలరింపజేస్తారు. ఇక పురుషులైతే ఏదోకచోట కోడిపందేలు నిర్వహిస్తారు. ఏడాదిలో నెలరోజుల పాటు పెద్ద పండుగే. ఇదంతా పాతరోజుల్లో జరుపుకునే సంక్రాంతి. ఇప్పుడా కళ లేదు. నేటి కంప్యూటర్ యుగంలో అంతా సెల్‌ఫోన్ల మయమై సంక్రాంతి పండుగను జరుపుకునేవారే కరవయ్యారు. నెలరోజుల పండుగ కాదు కదా పట్టుమని మూడు రోజులు కూడా జరుపుకునేవారు లేకుం డాపోయారు. గొబ్బిళ్లు తట్టేవారే లేరు. ఇంటి ముంగిళ్లలో ముగ్గులు వేసే పరిస్థితి లేదు.

నేడు పల్లెల్లో కేవలం పండుగ చివరిరోజున గొబ్బెమ్మ పండుగ జరుపుకుంటున్నారు. యువతులు అందరూ చదువుకోవడం, చాలామంది ఉద్యోగాలు చేస్తుండడం, అసలు గొబ్బెమ్మ గొప్పతనాన్ని తెలుసుకోక పోవడం వల్ల గొబ్బెమ్మను తట్టేవారే లేకుండాపోయారు. పల్లెల్లో పశుసంపద కరువై ఇంటిముంగిళ్లలో పేడకల్లుతో చల్లే అలవాటులేకుండా పోవడంతో నెలరోజుల పెద్దపండుగ కాస్త మూడు రోజులకే పరిమితమైపోయింది. హరిజన, గిరిజన ప్రాంతాలు, ఉద్యోగులు, చదువుకున్నవారు తక్కువ ఉన్న ప్రాం తాలు, కుగ్రామాలు, అటవీ శివారు గ్రామాల్లో మాత్రమే ఈ సంక్రాంతి సంబరాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో అయితే సంక్రాంతి దాదాపు మరిచిపోయారేమో అనేలా మారింది.


హరిదాసు

మూడు రోజుల పండుగ విశిష్టత

పంటలన్నీ పండి ఇంటికి తీసుకువచ్చి ధాన్యంతో ఇళ్లు కళకళలాడే సమయంలో ఈ 3 రోజుల సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. పండుగ ప్రధానంగా నెల రోజుల ముందే ప్రారంభమై ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతారు. వేకువజామున హరిదాసుల పాటలు పాడుతారు. కోడిపందాలు, గంగిరెద్దులు, యెడ్ల పందాలు, ఒక్కమాటలో చెప్పాలంటే మన సంస్కృతి మొత్తం ఈ పండుగలో ప్రతిబింబిస్తుంది. అత్తిరాసాలు, కజ్జికాయలు, చక్కిలాలు, కారాలు, లడ్డూలు ఈ పండుగ ప్రత్యేక వంటకాలు. అది నాటి నుంచి నేటివరకు సాగుతోంది. తొలిరోజు భోగిపండుగ. ఆ రోజున వేకువజామునే భోగి మంటలు వేస్తారు. భోగిమంటల్లో పిడకలతో పాటు ఇళ్లలో ఉన్న పాత వస్తువులన్నింటినీ వేస్తారు. రెండో రోజు మకర సంక్రాంతి. ఆ రోజున ఇంట్లో చనిపోయిన పెద్దలను స్మరించుకుంటూ వారికి బట్టలు పెట్టుకోవడం ఆనవాయితీ. మూడోరోజున కనుమ పండుగ. దీనిని పసల పండుగ అని కూడా అంటారు. తమతో పాటు మమేకమై ఉండే పశువులకు కూడా స్నానాలు చేయించి అందంగా ముస్తాబు చేసి పశువుల పండుగను నిర్వహిస్తారు.

పట్టణాల్లోను, దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు, బంధువుల ఆత్మీయులంతా తమ స్వగ్రామాలకు చేరుకుని ఎంతో సంబరంగా ఆత్మీయ తానురాగాలతో కలిసి జరుపుకునే ఈ పండుగ ఉనికి రాను రాను తగ్గిపోతోంది. మరో మూడురోజుల్లో ఈ పండుగ ప్రారంభం కానుంది. అయినా ఏ ఇంటిముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు లేవు, గొబ్బెమ్మ తట్టేవారు లేరు, ఆ సందడే లేకుండా పోవడం చూసి వృద్ధులు ఆవేదనకు గురవుతున్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిస్తున్నారు.


గంగిరెద్దు

మా చిన్నతనంలో నెలంతా సందడే



మా చిన్నతనంలో సంక్రాంతి అంటే నెలరోజుల పండుగ. ఎక్కడ చూసినా ఆనందం. ప్రతి ఇంటిముంగిటా నెలరోజులంతా ముగ్గులు వేసే వారు. పేడతో ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి గుమ్మడి పూలు పెట్టి ఇంటిముంగిళ్లలో సంక్రాంతికి స్వాగతం చెప్పేవారు. నాడు ఉన్న మట్టి ఇళ్లకు సున్నంతో కొత్త శోభ కల్పించేవారు. పట్టణానికి వెళ్లి సరుకులు తెచ్చుకుని కూతుళ్లను, అల్లుళ్లను పిలిపించుకుని సంక్రాంతి సంబరంగా చేసుకునే వారు. నేడు ఆ జాడే లేకుండా పోయింది.

- ముమ్మడి చిన్నయ్య, మన్నూరు, రాజంపేట


బంధుమిత్రులతో భోగి వేడుకలు (ఫైల్)


సందడిగొలిపే కత్తిలేని కోడిపందాలు

సంక్రాంతి కళ తప్పింది



రాను రాను పండుగలంటే తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి ఒక్క కారణం అంటూ చెప్పలేం. పల్లెవాసులందరూ ఉద్యోగాల పేరిట పట్టణాల్లో చేరి పండుగల గొప్పతనాన్ని మరచిపోయారు. ఒకనాటి సంక్రాంతి పండుగకు నేటి పండుగకు ఎంతో తేడా వస్తోంది. కాలానుగుణంగా యువత మారిపోయింది. పల్లెల్లో ఐకమత్యం తగ్గిపోయింది. ఆర్థిక పరిస్థితులు మెరుగు పడడంతో ఒకరిలో ఒకరు లేకుండా పోయారు. దీంతో సంక్రాంతి సైతం కళ తప్పింది.

- గునకల సుబ్బరాయుడు, రాజంపేట

సంక్రాంతి కోసం రెండు ఆలయాలకు కమిటీల నియామకం

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాజుపాలెం మండలం వెల్లాల గ్రామంలోని రెండు దేవాలయాలకు కలిపి ఒక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. గ్రామంలోని చెన్నకేశవ సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు తొమ్మిది మందితో కూడిన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసింది. గ్రామంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకూ సంక్రాంతి పండుగ నిర్వహించనున్న సందర్భంగా ఈ ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని నియమించింది.

గ్రామంలోని పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ అన్ని నియమాలను సడలిస్తూ ప్రత్యేక సందర్భంగా పరిగణిస్తూ ఈ ధర్మకర్తల మండలి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీలో గ్రామానికి చెందిన గంగిరెడ్డి లక్ష్మినారాయణరెడ్డి, సుంకుగారి లక్ష్మీనరసింహారెడ్డి, బీరం అశోక్ మహరాజ్ రెడ్డి, దుద్యాల అచ్చమ్మ, దూదేకుల చిన్నదస్తగిరి, సుంకుగారి సుజా రజని, భజంత్రి విజయలక్ష్మి, రామంతుల దీనమ్మ, మలికి రమణయ్యలను మండలి సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వీసీల నియామకానికి సెర్చ్ కమిటీలు

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు వర్సిటీలకు వేర్వేరుగా ఈ సెర్చ్ కమిటీలను నియమించారు. ఒక్కో యూనివర్సిటీకి వైస్ చాన్సలర్‌ను ఎంపిక చేయడానికి ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఈ కమిటీలను ప్రభుత్వం కోరింది. ముగ్గురి నుంచి ఒకరిని ఎంపిక చేయడానికి చాన్సలర్ (గవర్నర్)కు పంపాల్సి ఉందని పేర్కొన్నారు.

సెర్చ్ కమిటీలో కూడా ప్రభుత్వం తరఫున ఒకరిని, సంబంధిత వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి ఒకరిని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి మరొకరిని కలిపి సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు. కడప యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎంపిక కోసం ప్రభుత్వం తరఫున ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి.జార్జ్‌విక్టర్, ఈసీ నుంచి రాయలసీమ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.వి.ప్రసాదరావు, యూజీసీ నుంచి మండి సర్దార్ పటేల్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దేవ్‌దత్ శర్మలను సెర్చ్ కమిటీ సభ్యులుగా నియమించారు.

ఇక కడప డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల సెర్చ్ కమిటీలో ప్రభుత్వం తరఫున కృష్ణా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారావు, ఈసీ నుంచి తిరుచ్చి ఎన్ఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్, యూజీసీ నుంచి లక్నో డాక్టర్ శకుంతలా మిశ్రా, నేషనల్ రిహాబిలిటేషన్ వర్సిటీ ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ సంజయ్‌సింగ్‌లను నియమించారు.

సెర్చ్ కమిటీలు వీలైనంత త్వరగా సమావేశమై ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ప్రభుత్వం కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ : ఒకరి మృతి


ఎజాస్‌అలీఖాన్ మృతదేహం, గాయపడ్డ రాజు

చిన్నమండెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపాన కడప-బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన వారు కారులో రాయచోటి నుంచి బెంగళూరు వెళుతుండగా గుర్రంకొండ నుంచి ఎజాస్ అలీఖాన్ రాయచోటి వైపు వెళుతుండగా కారు ఢీకొనగా ఎజాస్‌అలీఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న రాజు, రత్నమ్మలు తీవ్రంగా గాయపడడంతో వారిని స్థానికులు, పోలీసుల సహాయంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నందలూరు వద్ద రెండు బైకులు ఢీకొని...


సంఘటనాస్థలంలో మృతదేహం, హరికృష్ణ (ఫైల్)

నందలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బైకులు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన సోమేశుల హరికృష్ణ (28) బైకుపై కడప వైపు వెళుతుండగా మంటపంపల్లె సమీపంలోని కోనరాజుపల్లె గ్రామానికి చెందిన ఈర్ల వేణుగోపాల్, ఈర్ల రాజశేఖర్ బైక్‌పై నందలూరు వైపు వస్తూ ఢీకొన్నారు. దీంతో సోమేశుల హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఫైళ్లు కదలడం లేదు

- మూలనపడ్డ దాదాపు 600 ఫైళ్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఆదాయం వచ్చే ఫైళ్లకే ప్రాధాన్యం
- సాధారణ రైతుల ఫైళ్లన్నీ పక్కనే...
- 22ఏ, డాటెడ్ ల్యాండ్, ఫ్రీహోల్డ్ ఫైల్స్ పట్టించుకునే అధికారే కరువు...

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి 22ఏ, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్, నేషనల్ ఖాతాలో ఉన్న భూముల ఫైళ్లు కొన్ని కలెక్టరేట్‌లో మూలనపడేశారని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు వారి స్వలాభాన్ని చూసుకుని వారికి డబ్బులు వచ్చే ఆ ఫైళ్లను మాత్రమే కదిలించారని, మిగిలిన ఫైళ్లన్నీ మూలనపడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది నుంచి చాలామంది రైతులు తమ ఫైల్స్ కనపడటం లేదని, మా ఫైల్స్ పూర్తి కాలేదని కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రైల్వేకోడూరు, మదనపల్లి, రాజంపేట ప్రాంతాల నుంచి ఫైల్స్ విషయమై ఎక్కువగా ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ కార్యాలయంలోని కొన్ని సెక్షన్‌లలో ఉన్న కింది స్థాయి అధికారులు తప్పులు చేసి ఫైల్స్ పంపించడం వల్ల కూడా కొన్ని ఫైల్స్ వెనక్కి వస్తున్నాయని, అంతేకాకుండా సెక్షన్లలో సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కూడా ఫైల్స్ ముందుకు జరగడం లేదన్న వాదన ఉంది. జిల్లాలోని 30 మండలాలకు చెందిన దాదాపు 600 పైచిలుకు ఫైల్స్ కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఫైల్స్ పూర్తి చేశారని, రైతులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 6 నెలలు పూర్తి అవుతున్నా 22ఏ, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ ఒక్క ఫైల్ కూడా పూర్తి చేయలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు గతంలో మూలనపడిపోయిన ఫైల్స్‌ను పూర్తి చేసి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి...

కలెక్టరేట్‌లో కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తాము. గతంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కూడా ఆదేశించారు. ఆ ఫైళ్లన్నీ కూడా త్వరగా పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాము.

- మధుసూదన్‌రావు, డీఆర్‌వో

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి



జిల్లా అధికారులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వారిపైన వెంటనే చర్యలు తీసుకునే విధంగా పరిపాలన ఉండాలి. ఫైల్స్ తప్పులు రాసి పంపిస్తే వారిపై కూడా యాక్షన్ తీసుకోవాలి. అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుంది. గత ప్రభుత్వంలో ఉన్న అధికారులు అందరు తమకు ఆదాయం వచ్చే ఫైళ్లను మాత్రమే కదిలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు కూడా ఫైల్స్ కదలడం లేదు. దూర ప్రాంతాల నుంచి రైతులు పదే పదే కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే ఎంత ప్రయాసో జిల్లా అధికారులు గుర్తించి వారి ఫైల్స్‌ను పూర్తి చేసి పంపాల్సిన బాధ్యత వారిపైన ఉంటుంది.

- సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను



రాజంపేట డివిజన్‌లోని పుల్లంపేట మండలం శ్రీనివాసపరంలో సర్వే నెంబర్-1215లో 2.60 ఎకరాలను గతంలో రిజిస్ట్రేషన్ కాకుండా ఆపేశారని అధికారులు చెప్పారు. అందువల్ల నేను ఏడాదికాలంగా కలెక్టర్ కార్యాలయంలో చాలాసార్లు అర్జీలు పెట్టాను. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులను అడిగితే వెళ్లి మీ తహసీల్దార్‌లను అడగండి అని చెబుతున్నారు. వారిని అడిగితే కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్లండి అని సలహా ఇస్తున్నారు. ఇలా ఒకరిపైన ఒకరు పెట్టుకుని ఏడాదికాలంగా నా ఫైలు చేయడం లేదు. నేను ఒక సామాన్య రైతుని. ప్రతిరోజూ కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే నాకు ఎంత శ్రమ ఉంటుంది. రెండు బస్సులు మారి రాయచోటికి రావాలి. ఎంత ఖర్చు వస్తుందో ఒకసారి మీరే ఆలోచన చేయండి.

- వెంకట్రామిరెడ్డి, పుల్లంపేట మండలం

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



సిద్దవటం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఓ ప్రేమజంట వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లెకు చెందిన మనోహర్ (26), కళాశ్రీ (24) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. మనోహర్ కడప ఎయిర్‌పోర్టులో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కళాశ్రీ కడప వివేకానంద కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వీరి వివాహానికి కుటుంబపెద్దలు అంగీకరించకపోవడంతో గురువారం ఉదయం 11 గంటలకు కడప-చెన్నై జాతీయ రహదారిలోని ఉమామహేశ్వర నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ వారు మేజర్లు కావడంతో, ఇరువురి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడగా మనోహర్ కుటుంబ సభ్యులు అంగీకరించారని, కళాశ్రీ కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నామని తెలిపారు.

నాటుసారా స్వాధీనం : ఇరువురి అరెస్టు

వాల్మీకిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శికారిపాళెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ ప్రాంతంపై ఈఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించి 30 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. గ్రామానికి చెందిన బి.శీన, జి.శంకరయ్య అనే వారిని అరెస్టు చేశారు. ఇరువురినిరిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. దాడులలో ఈఎస్‌టీఎఫ్ సీఐ యల్లయ్య, ఎస్ఐ శశిధర్, సిబ్బంది మోహన్‌రెడ్డి, వేమారెడ్డి, బాలకృష్ణ, విఘ్నేష్‌లు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు

- బిల్లుపైనే క్యూఆర్ కోడ్ ముద్రణ
- విద్యుత్ శాఖలో నూతన విధానం
- తొలి విడత కడప డివిజన్‌లో అమలు
- విజయవంతమైతే జిల్లా అంతటా...
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



సద్వినియోగం చేసుకోవాలి

క్యూఆర్ కోడ్‌తో బిల్లులు ఇస్తున్నాం. దీనిపై వినియోగదారులకు అవగాహన పెంచాం. బిల్లింగ్‌లో పారదర్శకత పెరుగుతుంది. స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులతో ఎటువంటి మోసాలకు ఆస్కారం ఉండదు. వినియోగదారులు సులలువుగా చెల్లించుకోవచ్చు. బిల్లింగ్ లోపాలు ఉన్న సరిదిద్దుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరు విని యోగించుకోవాలి.

- ఎస్.హరి సేవ్యానాయక్, ఈఈ, కడప డివిజన్

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఆశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధా నం సత్ఫలితాలు ఇస్తుందని సంబంధిత అధికారులు చెబుతు న్నా రు. ఇది విజయవంతం అయితే జిల్లా వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుడతామన్నారు. నెలవారీ విద్యుత్ బిల్లుల చెల్లింపును ఏపీఎస్పీడీసీఎల్ మరింత సులభతరం చేసింది. ఇంటి వద్ద నుంచి బ్యాంకు ఖాతా ఫోన్ నెంబర్ అనుసంధానంగా ఉండే ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా చెల్లింపులు మరింత సులభతరం చేసేందుకు విద్యుత్ బిల్లులపైనే క్యూఆర్ కోడ్ ముద్రించింది. ప్రత్యేక డిజిటల్ విధా నాన్ని రూపొందించింది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సులువుగా బిల్లును చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు. జనవరి 1వ తేదీ నుంచి కడప డివిజన్ పరిధిలో ప్రారంభించారు. హెచ్‌టీ సర్వీసులకు మినహాయించి బకాయిలు లేని మిగిలిన సర్వీస్‌దారు లకు స్కాన్ ద్వారా బిల్లు కట్టే అవకాశాన్ని కల్పించారు.



బిల్లు చెల్లింపు కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రయోగాత్మకంగా..

కడప డివిజన్ పరిధిలో జనవరి 1 నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. కడప డివిజన్‌లో గృహ వినియోగదారులకు సంబంధించి 1,69,544 మీటర్లు, వాణిజ్య 23,793 మీటర్లు, పరిశ్రమల కోసం వినియోగించేవి 749 మీటర్లు, దేవాలయాలు, చర్చి, మసీదు, వీధి దీపాలు మంచినీటి పంపుల కోసం వినియో గించేవి 3818 మీటర్లు కలిపి మొత్తం 1,97,902 మీటర్లు ఉన్నాయి. అయితే గత ఏడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్స్



ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వెసులుబాటు ఉండేది. రిజర్వు బ్యాంకు ఆదేశాలతో విద్యుత్ సంస్థలు వాటి సేవలు నిలిపివేశాయి. ఈ పద్ధతిలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి విని యోగదారులకు సులువుగా ఉండేది. ఆ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో సంస్థ ఖాతాలకు డబ్బు జమ అయ్యేది కాదు. దీని వల్ల డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చెల్లింపుల్లో జాప్యం కారణంగానే రిజర్వు బ్యాంకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతికి స్వస్తి చెప్పారు. ప్రత్యామ్నాయంగా పాత పద్ధతిలోనే మీ సేవా కేంద్రాలు, సంబంధిత సెక్షన్ కార్యాలయాలు, సంస్థకు చెందిన ఈస్ట్రన్ పవర్ యాప్‌లో చెల్లించేవారు. మీసేవా కేంద్రాల్లో అయితే సర్వీసు చార్జీ రూ.5చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు వినియోగదారునికి బిల్లులు అందిన వెంటనే చెల్లింపుల ప్రక్రియ వేగవంతమయ్యేలా క్యూఆర్ కోడ్‌ను విద్యుత్ సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. దీనిపై వినియోగదా రులకు అవగాహన కల్పిస్తున్నారు. క్యూఆర్ కోడ్ విధానంలో చెల్లిం పుల వల్ల పారదర్శకత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సౌత్‌ఇండియా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక



విద్యార్థి గౌరీశంకర్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

పులివెందుల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సౌత్‌ఇండియా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత (మెయి న్) పాఠశాలకు చెందిన విద్యార్థి గౌరీశంకర్ తయారు చేసిన సీఓ టూ ప్రాజెక్టు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురు వారం స్థానిక పాఠశాలలో ఆయ న మాట్లాడుతూ బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో వ్యక్తిగత విభాగం కింద ఈ ప్రాజెక్టు ఎంపి కైందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆపడం వలన కార్బన్ డైఆక్సై డ్ (సీఓటు) వాయువు ఎక్కువగా విడుదలై వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇందుకు పరిష్కారంపై ఉపాధ్యాయులు సీవీ ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థి గౌరీశంకర్ ఈ ప్రాజెక్టును రూపొందించాడన్నారు. ఈ ప్రాజెక్టును ఈనెల 20 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో నిర్వహించే పోటీలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తల దాడి

వీరపునాయునిపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిదెన ఓబాయపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మందా శంకరయ్యపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో శంకర య్యకు తీవ్ర గాయాలపాలయ్యాడు. కలందొడ్డిలోకి నీళ్ల పోతున్నాయని అడిగినందుకు కామనూరు ఈశ్వరయ్య, శంకరయ్య, సారయ్యలు కలిసి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భర్త హత్య కేసులో భార్యతో పాటు నలుగురికి జీవితఖైదు



నిందితులను చూపుతున్న పోలీసులు

మైలవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకు నేందుకు ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన కేసుకు సంబంధించి భార్యతో పాటు మరో నలుగురికి ప్రొద్దుటూరు రెండవ ఏడీజే కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి గురువారం తెలి పారు. ఎస్ఐ వివరాల మేరకు.. తొర్రివేముల గ్రామానికి చెందిన కుమ్మరి గురుప్రసాద్, కుమ్మర ప్రమీల దంపతులు. కాగా, అదే గ్రామా నికి చెందిన తీట్ల సురేష్ అలియాష్ ఆటో సూరితో కుమ్మర ప్రమీల వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త అడ్డు తగులుతున్నాడని పథకం ప్రకారం హత్య చేసేందుకు కుట్ర పన్నారు. ఈ నేపథ్యంలో 2019 జనవరి 24వ తేదీ సమీప గ్రామమైన వేపరాలకు గురుప్రసాద్ బేల్దారి పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి తొర్రివేముల గ్రామానికి తిరిగి వస్తుండగా.. వేపరాల తొర్రివేముల గ్రామాల మధ్య ఉన్న బాబాసాబ్ బావి వంక వద్ద నిందితులు అతనిపై రాడ్లతో దాడి చేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మైలవరం పోలీసుస్టే షన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి నిందితులు కుమ్మర ప్రమీల, తీట్ల సురేష్ అలియాష్ ఆటో సూరి, కొమ్ము పెద్దిరాజు, చాకలి గురుస్వామి, మాదిగ ప్రతాప్‌లకు కోర్టు ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానాతో పాటు జీవితఖైదు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

91క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వేంపల్లె, జనవరి 9 (ఆంధ్ర జ్యో తి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఐచర్ వాహనంతో పాటు 91క్వింటాళ్ల రేషన్ బియ్యా న్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమ రవా ణా చేస్తున్నా రన్న సమాచారం రావడంతో గురువారం తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్ తనిఖీ చేపట్టారు. చింతలమడుగుపల్లె-టి.వెలమవారిపల్లె గ్రామాల పొలాల మధ్య ఐచర్ వాహనంలో ఉన్న 177 మూటెల రేషన్‌బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చంద్రమోహన్ అనే వ్యక్తిని అదుపు లోకి తీసుకొని.. బియ్యాన్ని గోడౌన్‌కు తరలించారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నాయకుల నారాయణ, శివన్న పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కడప క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం డీఈవో కార్యాలయ సమీపంలోని మురుగుకాల్వలో అనుమానాస్పదస్థితిలో యువకుడి మృత దేహం లభించింది. స్థానికులు చిన్నచౌకు పోలీసులకు సమాచారం అం దించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మురుగుకాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. సిద్దవటం మండలం బోడిశెట్టిపల్లెకు చెందిన పోలుబోయిన నరసింహులు (33) కడప ఓంశాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఎంటెక్ పూర్తి చేసి కడపలో చిన్నచిన్న పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తల్లి వీరమ్మ సొంత ఊరికి పోవడంతో ఇంట్లో నరసింహులు ఒక్కడే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కాల్వలో మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసుల కు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకొని పోస్టుమార్టం నిమి త్తం రిమ్స్‌కు తరలించారు. ఇతని మృతిపై పోలీసులు విచారిస్తున్నారు.

కరెంటు వైర్లు తగిలి యువకుడు...

కడప క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ సర్కిల్ సమీపంలో విద్యుత్‌వైర్లు తగిలి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజీవ్‌కుమార్ (23) మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. సంజీవ్ కుమార్ కడ పలో రెండేళ్ల నుంచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురు వారం మధ్యాహ్నం ట్రాన్స్‌పోర్టు వెనుక భాగంలో పనిచేస్తున్న సమ యంలో కరెంటు వైర్లు తగిలి మృతి చెందినట్లు తెలిపారు.

బ్రహ్మంసాగర్‌లో వృద్ధుడు..

బ్రహ్మంగారిమఠం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో గురువారం రామిరెడ్డి (78) అనే వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వీరపునాయునిపల్లె మండలం వెలుదుర్తి గ్రామా నికి చెందిన రామిరెడ్డి ఇంటి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనానికి వెళు తున్నానని బ్రహ్మంగారిమఠంకు వచ్చి బ్రహ్మంసాగర్‌లో దూకి ఆత్మహ త్య చేసుకున్నాడని తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

లింగాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దొండ్లవాగు గ్రామానికి చెందిన గంగిరెడ్డి బాల గంగిరెడ్డి అనే రైతు గురువారం తన ఇంటిలో ఉరి వేసు కొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. బాల గంగిరెడ్డి తనకున్న పొలంలో శనగ పంట సాగు చేశాడు. ఇ-పంట నమోదు కోసం రైతు సేవా కేంద్రం సిబ్బందితో చర్చించి ఇ-పంటలో నమోదు చేయాలని కోరారు. తర్వాత ఏం జరిగిందో ఏమో పోలీసుస్టేషన్‌కు బాల గంగిరెడ్డిని పోలీసులు పిలిపించారు. స్టేషన్‌కు మరోసారి రావాలని చెప్పి పంపిం చడంతో ఆందోళనకు గురై బాలగంగిరెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఉపాధి పథకంలో ఖర్చు చేసింది రూ.8.48 కోట్లు

- అవినీతి జరిగింది రూ.36,350
- ఉపాధి సిబ్బందిపై అడిషనల్ పీడీ ఆగ్రహం
- తుమ్మలపల్లె ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ



ఉపాధి బహిరంగ సమావేశంలో పాల్గొన్న అధికారులు

బి.కోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గురువారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. 2023-24 సంవత్సరానికి రూ.8.48 కోట్లు ఖర్చు చేయగా అందులో అవినీతి రూ.36,350లు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. ఈ కార్యక్ర మానికి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డిలు హాజర య్యారు. మండలంలో పది పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీ గురించి సామాజిక తనిఖీ బృందం జరిపిన పనులు, వాటి వివరాలు అవినీతి బహిర్గతం చేశారు. వీటిపై ఉపాధి సిబ్బంది పని తీరు సక్రమంగా లేదని అడిషనల్ పీడీ నాగర త్నమ్మ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తుమ్మలపల్లె ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణకు ఆదేశించారు. అలాగే పాయల కుంట్ల, మేకవారిపల్లె గ్రామ పంచాయతీల్లో పనులకు రాకున్నా మస్టర్లు వేయడం, ఒకరి బదులు మరొకరు పనిచేయడం, వారికి బిల్లులు చేయడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఎస్ఆర్‌పీ భాస్కర్, ఏపీడీ ఆనంద్, ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీపీ చెన్నమ్మ, ఏపీవో రాజసాహెబ్, ఈసీ ఖాజా మరియు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఈ అవార్డు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

- కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి



విజేతలను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ లోని పాలిటెక్నిక్ ఫెస్ట్‌లో రెండో బహుమతి గెలిచిన విద్యార్థుల విజయం విద్యార్థుల ప్రతిభకు సాంకేతిక నైపుణ్యానికి నిదర్శ నమని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. గవ ర్నమెంటు పాలిటెక్నిక్, కమలాపురం కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు మంగళవారం విజయవాడలో జరిగిన పాలిటెక్నిక్ ఫెస్ట్ 2024లో రెండో బహుమతి గెలుచుకుని కళాశాల పేరును రాష్ట్రస్థాయిలో వెలుగులోకి తెచ్చారన్నారు. గురువారం కళాశాలలలో రాష్ట్రస్థాయిలో పాలిటెక్నికల్ కళా శా లను ద్వితీయ స్థానంలో నిలిపిన విజేతలకు సన్మాన కార్యక్ర మం నిర్వహించారు. విజేతలను ఘనంగా సన్మానించారు. అనం తరం మాట్లాడుతూ టెక్నోఫెస్ట్‌లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు శివకవిత, లావణ్య, ఈసీఈ రెండో సంవత్సరం విద్యా ర్థుల సృజనాత్మకత, ప్రతిభ కళాశాల గర్వించదగ్గది, వీరు రూపొందించిన డిస్పెన్సరీ ఫర్ ఎల్డర్లీ మెడికేషన్ అడ్హెరెన్స్ ప్రాజె క్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిందని ఆయన తెలిపారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు హోదా సభ్యులు పాల్గొని విజేతలను అభినందించారు.

గంగమ్మగుడి వేలం బకాయిలు రూ.8.67 లక్షలు

సికెదిన్నె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మగుడి తలనీలాలు, టెంకాయల వేలానికి సంబంధించి రూ.8,67,300 బకాయిలు ఉన్నట్లు ఈఓ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఈఓ బ కాయిల వివరాలను పత్రికా విలేకరులకు వివరించారు. ఇందులో తలనీలాలకు సం బంధించి రూ.6,38,300 బకాయిలు ఉన్నాయన్నారు. 2015-16లో ఎస్.సాయి రూ.1.45లక్షలు, 2016-17లో జె.చి న్నశ్రీను రూ.95,500, 2017-18లో ఎస్.క్రిష్ణమూర్తి రూ.2,42,700, 2018-19లో పి.సుబ్బరాయుడు రూ.9600, 2020-21లో ఎం.పుల్లయ్య రూ.1,45,500 బకాయిలు ఉన్నారు. టెంకాయల వేలానికి సంబంధించి 2015-16లో బి.వి.రమణ రూ.30వేలు, 2021-22లో ఎస్.పాలకొండయ్య రూ.45వేలు, 2023-24లో ఇ.రామలక్ష్మిరెడ్డి రూ.1.54 లక్షలు మొత్తం రూ.2.29 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. వారికి నోటీసులు కూడా అందించామని ఈఓ తెలిపారు.

రూ.2.15 లక్షలు పలికిన తలనీలాల వేలం

గంగమ్మగుడి తలనీలాల వేలం రూ.2.15 లక్షలకు వెంకటరమణ దక్కించుకున్నట్లు ఈఓ రవిశేఖర్‌రె డ్డి తెలిపారు. గంగమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన టెండర్ల వేలంలో పెండ్లిమర్రి మండ లానికి చెందిన రమణ వేలం దక్కించుకున్నాడన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు తలనీలాలు పోగుచేసుకునే హక్కు కలిగిఉంటారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇజితెమా..!

- చివరి రోజు లక్షలాదిగా తరలివచ్చిన ముస్లింలు



ఇజితెమాలో దువా చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూ రు కేంద్రంగా మూడురోజుల పాటు జరిగిన ఉమూమి తబ్లీగీ ఇజితెమా గురువారం మధ్యా హ్నం ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు జరిగిన సామూహిక దువా కార్యక్రమానికి లక్ష లాదిగా ముస్లింలు హాజరయ్యారు. ఇజితెమాలో జరిగే ఈ దువా కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రికే లక్షలాదిగా ముస్లింలు ఇజి తెమా ప్రాంగణానికి చేరుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ఆ తర్వాత ముంబై, నిజామోద్దీన్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గ దర్శకాలతో పాటు ప్రపంచశాంతి, దేశ ఔన్నత్యం గురించి వివరించారు. సర్వమానవాళి సమాన మేనని అందరి పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ, ఆప్యాయతను కలిగి ఉండాలని ఉపదేశించారు. మతాలకు అతీతంగా దేశ ఐక్యతను కాపాడు కుందామని ఉద్బోధించారు. ఆ తర్వాత 12.30 గంటల సమయంలో సామూహిక దువాను నిర్వహించిన అనంతరం మధ్యాహ్న నమాజ్‌ను పూర్తి చేసుకుని ఇజితెమా వేడుకలకు ముగింపు పలికారు. ఇదిలా వుంటే చివరి రోజు కూడా ఇజి తెమాకు వచ్చిన వారికి నిర్వహణ కమిటీ వా రు భారీ ఏర్పాట్లను కల్పించారు. వచ్చిన వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ సదుపాయం సమకూర్చారు. అదేక్రమంలో 17 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన సౌకర్యవంతమైన భోజన వసతిని కల్పి ంచారు. వివిధ ప్రాంతాల నుంచి దాతలు ఇజి తెమాకు వచ్చిన వారికి మజ్జిగ, పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సిద్ధం చేశారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పా టు చేసి వైద్యసేవలు అందించారు. ఇజితెమా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల్లో కొనుగోళ్లు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, నందికొట్కూరు మాజీ ఎమ్మె ల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇజితెమా కార్యక్రమా న్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లపై కమిటీని అభినందించారు.

నేడు లక్కిరెడ్డిపల్లె మండల సమావేశం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేడు లక్కిరెడ్డిపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రెడ్డెయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాపతినిధులు, అధికారులు హాజరు కావాలని తెలి యజేశారు.

తూతూ మంత్రంగా పెనగలూరు మండల సమావేశం

పెనగలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండల సర్వసభ్య సమావేశం గురువారం వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు, ప్రతిపాదనలు వంటి కార్యక్రమాలు ఏవీ జరగలేదు. ఎంపీడీవో విజయరావు శాఖల ప్రగతిని వివరించాలని అధికారులను కోరారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. జడ్పీటీసీ ఉదయగిరి పెద్ద సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ-2 బొడ్డు రోశయ్య కోఆప్షన్ సభ్యులు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో చిట్వేలి ఉపాధ్యాయుడి ప్రతిభ

చిట్వేలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో చిట్వేలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విజేతగా నిలిచారు. టీచర్స్ విభాగం నుంచి జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు అంతటి శివ నారాయణ గౌడ్ జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. ఆయన రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి కాపర్ కోటెడ్ బాటిల్ అనే ప్రాజెక్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ప్రధానోపాధ్యాయుడు ఏబీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు చంద్రయ్య, స్వామీజీ, దుర్గరాజు, వెంకటసుబ్బ య్య, గాయత్రి, లక్ష్మీకళావతి, సుహాసిని, బాదుషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంతో స్తంభించిన ట్రాఫిక్



సామగ్రిని తొలగిస్తున్న సీఐ

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనంపై నుంచి క్రేన్ సామగ్రి జారి రోడ్డుపై పడడంతో మండలంలోని మాధవరంపోడు పంచాయతీ పరిధిలో గురువారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారి రోడ్డులోని గోతుల కారణంగా లారీ అదుపుతప్పి అందులోని సామాగ్రి రోడ్డుకు అడ్డంగా పడినట్టు చెబుతున్నారు. రైల్వేకోడూరుసీఐ హేమసుందర్ క్రేన్ సాయంతో సామగ్రిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జీవితాన్ని ఆటలా ఆడుకోవడమే ధర్మం

● సినీ నటుడు బ్రహ్మానందం ● నేను అన్నమాచార్య విద్యార్థినే : కిరణ్ అబ్బవరం





సమావేశంలో ప్రసంగిస్తున్న సినీ హాస్యనటుడు బ్రహ్మానందం , సినీ హీరో కిరణ్ అబ్బవరంను సత్కరిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ, బ్రహ్మానందం, చొప్పా గంగిరెడ్డి

రాజంపేట/రాజంపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవితం ఓ ఆట లాంటిదని, దానిని ఆటలా ఆడుకోవడమే మన ధర్మం అని బ్రహ్మానందం అన్నారు. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ వెనుకబడిన ప్రాంతం అంటే అది కరెక్టు కాదని, వేంకటేశ్వరస్వామితోపాటు అన్నమయ్య, వీరబ్రహ్మం లాంటి మహామహులు ఉన్న గడ్డ అన్నారు. వేంకటేశ్వరస్వామి పూజలందుకున్నంత వరకు అన్నమాచార్యులకు గుర్తింపు ఉంటూనే ఉంటుందన్నారు. తన తండ్రి 8 మంది పిల్లలకు చదువు చెబుతూ .. ఎన్నో కష్టనష్టాలకోర్చి పేదరికంతో తమను పోషించారని, ప్రస్తుతం తాను ఈ స్థాయికి ఎదగడానికి ఆయన కష్టాన్ని గుర్తించి చదువుకోవడమే ప్రధాన కారణమన్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన సినీ హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. 25 ఏళ్ల కిందట అన్నమాచార్య విద్యాసంస్థలను రాజంపేటలో నెలకొల్పి నేడు యూనివర్సిటీ స్థాయికి తీసుకురావడం చొప్పా గంగిరెడ్డి పట్టుదలకు నిదర్శనమన్నారు. నేను ఈ కళాశాలలోనే ఇంజనీరింగ్ చదివానని, విద్యతో పాటు క్రమశిక్షణకు అన్నమాచార్య విద్యాసంస్థలు మారుపేరని తెలిపారు. అనంతరం గవర్నర్ దత్తాత్రేయ, హాస్యనటుడు బ్రహ్మానందం, కిరణ్ అబ్బవరం, ఇతర ముఖ్య అతిథులను అన్నమాచార్య యూనివర్శిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి, హాస్య నటుడు ప్రదీప్ కుమార్, ఎమ్మెల్సీ కె.శ్రీనాథ్‌చౌదరి, అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంఈ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

సిద్దవటం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలని ఎస్ఈ రమణ ఆదేశించారు. మండలంలోని లింగంపల్లె, సిద్దవటం విద్యుత్ ఉప కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో విద్యుత్ బకాయిలు చెల్లించనివారికి నోటీసులు జారీ చేసిచ కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. వాలిపోయిన విద్యుత్ స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హరిసేవ్యనాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రమణ్యం, ఏఈ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

'అడవికి నిప్పు'పై ప్రజలకు అవగాహన

సిద్దవటం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) :కొండలకు నిప్పంటించడం కారణంగా కలిగే నష్టాలపై మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లెల్లో గురువారం అటవీశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి మాట్లాడుతూ అడవిలో నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులు అంతరించిపోయే ప్రమాదం ఉందని, పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని, సూచించారు. ఎవరైనా కొండకు నిప్పు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పల్లె ప్రాంతాల్లో కొత్తవ్యక్తులు సంచరిస్తే సమాచారం తెలపాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎఫ్‌బీవో పెంచల్‌రెడ్డి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్లు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

చిన్నమండెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంక్ పైపులైన్, మరుగుదొడ్లను డకౌట్ ప్లాంటును ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని చాకిబండ కుమ్మరపల్లి గ్రామస్థులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ వందల సంవత్సరాల నుంచి పల్లె అడుగు పల్లె అనుభవంలో ఉన్న భూములను నేడు అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఆక్రమించుకుంటున్నారని, ప్రశ్నించిన గ్రామస్తులపై దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే భూముల ఆక్రమణలను అడ్డుకుని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

12న బండలాగుడు పోటీలు

రాయచోటిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న పట్టణ పరిధిలోని అర్చనా విద్యాసంస్థల్లో ఒంగోలు జాతి ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కరస్పాండెంట్ డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి 30 వేలు, నాల్గవ బహుమతిగా రూ.20 వేలు, ఐదవ బహుమతిగా రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



రాజంపేట: కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

రైల్వేకోడూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ ప్రైవేటు కళాశాలు, విద్యాసంస్థలు, పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో వేడుకలకు హాజరయ్యారు. పలు సంస్థల్లో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు వేషాల్లో అలరించారు. చిన్నారులు పతంగులు ఎగురవేశారు. భోగి మంటలు వేశారు. స్థానిక సిల్వర్ బెల్స్ హైస్కూలులో కరస్పాండెంట్ ఎంవీ కుమార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రిన్సిపాల్ యం. భాస్కర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్, ఐక్యూ ఏసీకో-ఆర్డినేటర్ జి. దయానందం, కళాశాల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే. రమేష్, పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక సాయివికాస్ ఉన్నత పాఠశాలలో రంగవల్లుల పోటీలతో ప్రారంభించి భోగిమంటలతో ముగించారు. కరస్పాండెంట్ తిరుమల పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు రంగవల్లికలు తీర్చిదిద్దారు. హరిదాసు వేషదారణలో ఆమంచి సుబ్రమణ్యం, బుడబుక్కల వేషదారణలో గోర్ల నాని, సోదెమ్మ వేషధారణలో జంగిడి కళ్యాణి ప్రదర్శనలు, భోగిమంటలు ఆకట్టుకున్నాయి.

సంబేపల్లె: సంబేపల్లె, అడవికమ్మపల్లెల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కోలాటం, చెక్కభజన, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రామాపురం: మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం తెలుగు ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. .

రాజంపేట: రాజంపేట పట్టణంలోని రీజెన్సీ నలందా విద్యాలయంలో సీఏవో గుడారు విజయచందు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

గాలివీడు: నూలివీడు పంచాయతీలో ఉన్న శ్రీసరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో సంబరాలు అంబరాన్ని అంటాయి.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు



పెనగలూరు: కల్యాణ వెంకటేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం

గాలివీడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్దూరు బ్రాహ్మణ వీధిలోని వెంకటేశ్వరాలయం, గేట్‌లోని శ్రీకోదండ రామాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శుక్రవారం వేకువ జామునే మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

పెనగలూరు,: మండల కేంద్రంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా విష్ణు ఆలయాలు, శివాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాలు, అమ్మవార్ల దేవాలయాలను విద్యుద్దీపాలంకరణ తో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు.

ఉక్కు ఫ్యాక్టరీతోనే ఉపాధి అవకాశాలు



మహాసభల్లో మాట్లాడుతున్న లెనిన్‌బాబు

రాయచోటిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుతోనే రాయలసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ సంస్థ ప్రథమ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్క రించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పరిశ్రమలు లేక యువత వలస పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర విభజన హామీ మేరకు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలని, అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు. వెనుక బడిన ప్రాంతాల నిరుద్యోగులకు అవకాశం కావాలంటే రాజధానిని ఫ్రీజోన్ చేయడమే ఏకైక మార్గమన్నారు. విశ్వనాథ్‌నాయక్, జక్కుల వెంకటేశ్, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, కోటేశ్వరరావు, ప్రశాంత్, మాధవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి పల్లె పండుగ లక్ష్యం : చమర్తి



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభించారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు తెలియజేశారు. గురువారం వీరబల్లి మండలం సానిపాయ గ్రామం పెద్ద హరిజనవాడ, జింక హరిజనవాడ, జోతిమాల పల్లె, వెల్లులూరివారి పల్లెలో రూ. 15.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈవోపీఆర్‌డీ, గ్రామ స్పెషలాఫీసర్ రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నాగూర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, ఉపాధ్యక్షుడు దుర్గం ఆంజనేయులు, మాజీ సర్పంచ్ నేతి వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

సుండుపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీనగర్‌లో గురువారం టీడీపీ, జనసేన నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో 55 మీటర్ల రూ.2 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. వర్షం పడితే బాటసారులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో దాన్ని గుర్తించి ఈ రోడ్డుని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, దామోదర్‌నాయుడు, సుధీర్‌నాయుడు, జనసేన నాయకులు ఒంటేరు రాజా, రామా శ్రీనివాసులు, సలీం, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను గురువారం జనసేన పార్టీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 11 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ధ్యేయంగా చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. పుల్లంపేట, చిట్వేలి, రైల్వేకోడూరు, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే కొత్తవి రావడానికి ఎక్కువ సమయం పడుతుందని, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి విన్నవించామన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పేద పిల్లలకు దుస్తుల పంపిణీ



పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలోని రాయచోటి, గాలివీడు, సంబేపల్లె, వీరబల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అయ్యప్ప సొసైటీ వారి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని 250 మంది పేద విద్యార్థులకు కొత్త దుస్తులు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు, టీడీపీ నేత సురేశ్‌రెడ్డి, అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి స్వామి పాల్గొన్నారు.

రీసర్వే పై అపోహలు వద్దు



రామాపురం: ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

రామాపురం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): రీసర్వేపై ఆందోళన వద్దని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలో మిగిలిన మూడు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే కొనసాగుతుందన్నారు. గురువారం రాయచోటి ఆర్డీవో ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. 20వ తేదీన నల్లగుట్టపల్లి నుంచి రీ సర్వే ప్రారంభమవుతుందని, రైతుల తమ భూములు వద్ద ఉండి పక్కాగా సర్వే చేయించుకోవాలన్నారు. ఈ ర్యాలీలో తహసీల్దార్ రామాజనేయులు, రీసర్వే డీటీ, ఆర్ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మండలంలోని కే. బుడుగుంటపల్లెలో తహసీల్దార్ మహబూబ్ చాంద్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గంగరాజపురంలో మాత్రమే రీ సర్వే జరిగిందని, మిగిలిన గ్రామాల్లో రీ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపాలని అంగన్వాడీ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

రైల్వేకోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలంటూ గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యా లయం ప్రాంగణంలో సీఐటీ యూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్. శ్రీలక్ష్మీ, ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎన్. రమాదేవి మాట్లాడుతూ రైల్వేకోడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు అంగన్వాడీ కార్యకర్తలను వేధిస్తున్నారని ఆరోపించారు. మెమోలతో వేధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, అంగన్వాడీ కేంద్రాలను ప్రతి నెలా తనిఖీచేసి, పని తీరును మెరుగుపర్చుకోవాలని చెప్పినట్లు సీడీపీవో సౌభాగ్యమ్మ, ఏసీడీపీవో సరళాదేవి తెలిపారు.పనితీరును ప్రశ్నించినందుకు దుర్భాషలాడినట్లు కొందరు చిత్రీకరించారని తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

లక్కిరెడ్డిపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి); విద్యార్థులు కష్టపడి చదివతే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జాండ్రపల్లె పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ షహనాజ్‌షఫీ తెలిపారు. శుక్రవారం జాండ్రపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 10వేలు విలువ చేసే నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ అందజేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ,ఉపాధ్యాయులు, సిద్దేశ్వర, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు

'మానవత' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఓబులవారిపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్పీహైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం కెరియర్ గైడెన్స్, మోటివేషన్ క్లాసు నిర్వహించారు. గత సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన పి.గంగాదేవి అనే విద్యార్థినికి 5 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. సంస్థ చైర్మన్ కె. ప్రసాద్‌వర్మ, కో చైర్మన్ టి.వెంకటరమణయాదవ్, ప్రెసిడెంట్ ఎం.చంద్రమోహన్‌రాజు, డైరెక్టర్లు ఎ.శ్రీనివాసులు, పి.నారాయణ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



తహసీల్దార్ భవానీకి వినతి పత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

గాలివీడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం వ్యవస్థాపకుడు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్‌వింగ్ అధ్యక్షుడు బీవీ సాయి పరశు రాం, గాలివీడు మండల మెయిన్ వింగ్ మండ్ల మల్లికార్జున, గాలివీడు యూత్ వింగ్ కార్యదర్శి మండ్ల నరసింహ, గాలివీడు మండల ట్రెజరర్ దాదినేని సురేంద్ర, మండల అధ్యక్షుడు, ఆర్‌వీఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై ఫిర్యాదు

సుండుపల్లె, జనవరి9(ఆంధ్రజ్యోతి): కలకడకు చెందిన మెహరాజ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో తనపై అసభ్యకరంగా పోస్టులు పెట్టాడని సుండుపల్లె మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీకి చెందిన నూరుల్లా ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చే సినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా పోస్టులు పెట్టడం బాధాకరమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏదీ సంక్రాంతి వైభవం..?

సంక్రాంతి సందెలో గొబ్బిళ్లో..
మమ్మేలు మాలక్ష్మికి గొబ్బిళ్లో
నేడు మమ్మేలు మాలక్ష్మికి గొబ్బిళ్లో
ముత్యాల ముగ్గున్న వాకిళ్లలోన
వసియించే మాసిరికి గొబ్బిళ్లో
మందారపూవన్నే పారాణిలోన
కొలువుదీరిన తల్లికి గొబ్బిళ్లో...

ఇలాంటి గొబ్బిళ్ల పాటలు నేటి సంక్రాంతి మాసంలో ఎక్కడా వినపడ్డం లేదు. సంక్రాంతి నెల ప్రారంభమై 20 రోజులు దాటుతున్నా గొబ్బిళ్ల పాటలు.. ఇంటిముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు.. గంగిరెద్దుల సవ్వళ్లు అసలే కనిపించ డంలేదు. సంక్రాంతి వైభవం ఏటికేడాది తగ్గిపోతూ వస్తోంది.

- ఇళ్ల ముందు కనిపించని రంగవల్లులు
- కానరాని గంగిరెద్దులు, హరిదాసులు
- నెలరోజుల నుంచి.. మూడురోజులకే పరిమితమైన వేడుకలు
- పల్లెల్లో కనిపించని సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి వస్తున్నా ఇళ్లకు వేసుకోని రంగులు


ఇళ్లముందు వేయని ముగ్గులు

రాజంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది పల్లె సీమల్లో ఘనంగా జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి. దీనిని వాడుక భాషలో పెద్దపండుగగా పిలుస్తారు. మన సంస్కృతి సంప్రదాయాలకు ఈ పండుగ కొత్తశోభను తెస్తుంది. సంక్రాంతి వచ్చిందంటే పిల్లలకు పది రోజులు, యువతులు మహిళలకు నెలరోజుల పండుగ. యువకులకు ఏకంగా పక్షం రోజుల పండుగ. సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు 10 రోజులు సెలవులు ఇస్తారు. తాడాట, బొంగరాలు, గోలీల ఆటలు ఇలా ఎన్నో రకాల ఆటలాడుకుంటూ ఎంతో సరదాగా విద్యార్థులు గడిపేస్తారు. మహిళలు, యువతులైతే డిసెంబరు 15 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఈ పండుగను చేసుకుంటారు. తెల్లవారుజామునే ఇంటి ముంగిళ్లను శుభ్రం చేయడం, రంగురంగుల ముగ్గులు వేయడం, సంక్రాంతి తల్లిని ఆహ్వానిస్తూ ముగ్గులపై గొబ్బెమ్మ రూపంలో పేడ పెట్టి గుమ్మడిపూలతో అలంకరించడం చేస్తారు. నెలరోజుల పాటు సంక్రాంతి శోభను తెస్తారు.

యువతులందరూ ఒక్కటై గొబ్బెమ్మ పాటలతో నెలరోజుల పాటు ఊరందరిని అలరింపజేస్తారు. ఇక పురుషులైతే ఏదోకచోట కోడిపందేలు నిర్వహిస్తారు. ఏడాదిలో నెలరోజుల పాటు పెద్ద పండుగే. ఇదంతా పాతరోజుల్లో జరుపుకునే సంక్రాంతి. ఇప్పుడా కళ లేదు. నేటి కంప్యూటర్ యుగంలో అంతా సెల్‌ఫోన్ల మయమై సంక్రాంతి పండుగను జరుపుకునేవారే కరవయ్యారు. నెలరోజుల పండుగ కాదు కదా పట్టుమని మూడు రోజులు కూడా జరుపుకునేవారు లేకుం డాపోయారు. గొబ్బిళ్లు తట్టేవారే లేరు. ఇంటి ముంగిళ్లలో ముగ్గులు వేసే పరిస్థితి లేదు.

నేడు పల్లెల్లో కేవలం పండుగ చివరిరోజున గొబ్బెమ్మ పండుగ జరుపుకుంటున్నారు. యువతులు అందరూ చదువుకోవడం, చాలామంది ఉద్యోగాలు చేస్తుండడం, అసలు గొబ్బెమ్మ గొప్పతనాన్ని తెలుసుకోకపోవడం వల్ల గొబ్బెమ్మను తట్టేవారే లేకుండాపోయారు. పల్లెల్లో పశుసంపద కరువై ఇంటిముంగిళ్లలో పేడకల్లుతో చల్లే అలవాటులేకుండా పోవడంతో నెలరోజుల పెద్దపండుగ కాస్త మూడు రోజులకే పరిమితమైపోయింది. హరిజన, గిరిజన ప్రాంతాలు, ఉద్యోగులు, చదువుకున్నవారు తక్కువ ఉన్న ప్రాం తాలు, కుగ్రామాలు, అటవీ శివారు గ్రామాల్లో మాత్రమే ఈ సంక్రాంతి సంబరాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో అయితే సంక్రాంతి దాదాపు మరిచిపోయారేమో అనేలా మారింది.


హరిదాసు

మూడు రోజుల పండుగ విశిష్టత

పంటలన్నీ పండి ఇంటికి తీసుకువచ్చి ధాన్యంతో ఇళ్లు కళకళలాడే సమయంలో ఈ 3 రోజుల సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. పండుగ ప్రధానంగా నెలరోజుల ముందే ప్రారంభమై ప్రతి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతారు. వేకువజామున హరిదాసుల పాటలు పాడుతారు. కోడిపందాలు, గంగిరెద్దులు, యెడ్ల పందాలు, ఒక్కమాటలో చెప్పాలంటే మన సంస్కృతి మొత్తం ఈ పండుగలో ప్రతిబింబిస్తుంది. అత్తిరాసాలు, కజ్జికాయలు, చక్కిలాలు, కారాలు, లడ్డూలు ఈ పండుగ ప్రత్యేక వంటకాలు. అది నాటి నుంచి నేటివరకు సాగుతోంది. తొలిరోజు భోగిపండుగ. ఆ రోజున వేకువజామునే భోగి మంటలు వేస్తారు. భోగిమంటల్లో పిడకలతో పాటు ఇళ్లలో ఉన్న పాత వస్తువులన్నింటినీ వేస్తారు. రెండో రోజు మకర సంక్రాంతి. ఆ రోజున ఇంట్లో చనిపోయిన పెద్దలను స్మరించుకుంటూ వారికి బట్టలు పెట్టుకోవడం ఆనవాయితీ. మూడోరోజున కనుమ పండుగ. దీనిని పసల పండుగ అని కూడా అంటారు. తమతో పాటు మమేకమై ఉండే పశువులకు కూడా స్నానాలు చేయించి అందంగా ముస్తాబు చేసి పశువుల పండుగను నిర్వహిస్తారు.

పట్టణాల్లోను, దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు, బంధువుల ఆత్మీయులంతా తమ స్వగ్రామాలకు చేరుకుని ఎంతో సంబరంగా ఆత్మీయ తానురాగాలతో కలిసి జరుపుకునే ఈ పండుగ ఉనికి రాను రాను తగ్గిపోతోంది. మరో మూడురోజుల్లో ఈ పండుగ ప్రారంభం కానుంది. అయినా ఏ ఇంటిముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు లేవు, గొబ్బెమ్మ తట్టేవారు లేరు, ఆ సందడే లేకుండా పోవడం చూసి వృద్ధులు ఆవేదనకు గురవుతున్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిస్తున్నారు.


గంగిరెద్దు

మా చిన్నతనంలో నెలంతా సందడే



మా చిన్నతనంలో సంక్రాంతి అంటే నెలరోజుల పండుగ. ఎక్కడ చూసినా ఆనందం. ప్రతి ఇంటిముంగిటా నెలరోజులంతా ముగ్గులు వేసేవారు. పేడతో ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి గుమ్మడి పూలు పెట్టి ఇంటిముంగిళ్లలో సంక్రాంతికి స్వాగతం చెప్పేవారు. నాడు ఉన్న మట్టి ఇళ్లకు సున్నంతో కొత్త శోభ కల్పించేవారు. పట్టణానికి వెళ్లి సరుకులు తెచ్చుకుని కూతుళ్లను, అల్లుళ్లను పిలిపించుకుని సంక్రాంతి సంబరంగా చేసుకునే వారు. నేడు ఆ జాడే లేకుండా పోయింది.

- ముమ్మడి చిన్నయ్య, మన్నూరు, రాజంపేట


బంధుమిత్రులతో భోగి వేడుకలు (ఫైల్)


సందడిగొలిపే కత్తిలేని కోడిపందాలు

సంక్రాంతి కళ తప్పింది



రాను రాను పండుగలంటే తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి ఒక్క కారణం అంటూ చెప్పలేం. పల్లెవాసులందరూ ఉద్యోగాల పేరిట పట్టణాల్లో చేరి పండుగల గొప్పతనాన్ని మరచిపోయారు. ఒకనాటి సంక్రాంతి పండుగకు నేటి పండుగకు ఎంతో తేడా వస్తోంది. కాలానుగుణంగా యువత మారిపోయింది. పల్లెల్లో ఐకమత్యం తగ్గిపోయింది. ఆర్థిక పరిస్థితులు మెరుగు పడడంతో ఒకరిలో ఒకరు లేకుండా పోయారు. దీంతో సంక్రాంతి సైతం కళ తప్పింది.

- గునకల సుబ్బరాయుడు, రాజంపేట

సంక్రాంతి కోసం రెండు ఆలయాలకు
కమిటీల నియామకం

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాజుపాలెం మండలం వెల్లాల గ్రామంలోని రెండు దేవాలయాలకు కలిపి ఒక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. గ్రామంలోని చెన్నకేశవ సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు తొమ్మిది మందితో కూడిన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసింది. గ్రామంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకూ సంక్రాంతి పండుగ నిర్వహించనున్న సందర్భంగా ఈ ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని నియమించింది.

గ్రామంలోని పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ అన్ని నియమాలను సడలిస్తూ ప్రత్యేక సందర్భంగా పరిగణిస్తూ ఈ ధర్మకర్తల మండలి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీలో గ్రామానికి చెందిన గంగిరెడ్డి లక్ష్మినారాయణరెడ్డి, సుంకుగారి లక్ష్మినరసింహారెడ్డి, బీరం అశోక్ మహరాజ్ రెడ్డి, దుద్యాల అచ్చమ్మ, దూదేకుల చిన్నదస్తగిరి, సుంకుగారి సుజా రజని, భజంత్రి విజయలక్ష్మి, రామంతుల దీనమ్మ, మలికి రమణయ్యలను మండలి సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వీసీల నియామకానికి సెర్చ్ కమిటీలు

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు వర్సిటీలకు వేర్వేరుగా ఈ సెర్చ్ కమిటీలను నియమించారు. ఒక్కో యూనివర్సిటీకి వైస్ చాన్సలర్‌ను ఎంపిక చేయడానికి ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఈ కమిటీలను ప్రభుత్వం కోరింది. ముగ్గురి నుంచి ఒకరిని ఎంపిక చేయడానికి చాన్సలర్ (గవర్నర్)కు పంపాల్సి ఉందని పేర్కొన్నారు.

సెర్చ్ కమిటీలో కూడా ప్రభుత్వం తరపున ఒకరిని, సంబంధిత వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి ఒకరిని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి మరొకరిని కలిపి సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు. కడప యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎంపిక కోసం ప్రభుత్వం తరపున ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి.జార్జ్‌విక్టర్, ఈసీ నుంచి రాయలసీమ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.వి.ప్రసాదరావు, యూజీసీ నుంచి మండి సర్దార్ పటేల్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దేవ్‌దత్ శర్మలను సెర్చ్ కమిటీ సభ్యులుగా నియమించారు.

ఇక కడప డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల సెర్చ్ కమిటీలో ప్రభుత్వం తరపున కృష్ణా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారావు, ఈసీ నుంచి తిరుచ్చి ఎన్ఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్, యూజీసీ నుంచి లక్నో డాక్టర్ శకుంతలా మిశ్రా, నేషనల్ రిహాబిలిటేషన్ వర్సిటీ ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ సంజయ్‌సింగ్‌లను నియమించారు.

సెర్చ్ కమిటీలు వీలైనంత త్వరగా సమావేశమై ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ప్రభుత్వం కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ : ఒకరి మృతి



ఎజాస్‌అలీఖాన్ మృతదేహం, గాయపడ్డ రాజు

చిన్నమండెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపాన కడప-బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన వారు కారులో రాయచోటి నుంచి బెంగళూరు వెళుతుండగా గుర్రంకొండ నుంచి ఎజాస్ అలీఖాన్ రాయచోటి వైపు వెళుతుండగా కారు ఢీకొనగా ఎజాస్‌అలీఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న రాజు, రత్నమ్మలు తీవ్రంగా గాయపడడంతో వారిని స్థానికులు, పోలీసుల సహాయంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నందలూరు వద్ద రెండు బైకులు ఢీకొని...


సంఘటనాస్థలంలో మృతదేహం, హరికృష్ణ (ఫైల్)

నందలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బైకులు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన సోమేశుల హరికృష్ణ (28) బైకుపై కడప వైపు వెళుతుండగా మంటపంపల్లె సమీపంలోని కోనరాజుపల్లె గ్రామానికి చెందిన ఈర్ల వేణుగోపాల్, ఈర్ల రాజశేఖర్ బైక్‌పై నందలూరు వైపు వస్తూ ఢీకొన్నారు. దీంతో సోమేశుల హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఫైళ్లు కదలడం లేదు

- మూలనపడ్డ దాదాపు 600 ఫైళ్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఆదాయం వచ్చే ఫైళ్లకే ప్రాధాన్యం
- సాధారణ రైతుల ఫైళ్లన్నీ పక్కనే...
- 22ఏ, డాటెడ్ ల్యాండ్, ఫ్రీహోల్డ్ ఫైల్స్ పట్టించుకునే అధికారే కరువు...

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి 22ఏ, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్, నేషనల్ ఖాతాలో ఉన్న భూముల ఫైళ్లు కొన్ని కలెక్టరేట్‌లో మూలనపడేశారని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు వారి స్వలాభాన్ని చూసుకుని వారికి డబ్బులు వచ్చే ఆ ఫైళ్లను మాత్రమే కదిలించారని, మిగిలిన ఫైళ్లన్నీ మూలనపడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది నుంచి చాలామంది రైతులు తమ ఫైల్స్ కనపడటం లేదని, మా ఫైల్స్ పూర్తి కాలేదని కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రైల్వేకోడూరు, మదనపల్లి, రాజంపేట ప్రాంతాల నుంచి ఫైల్స్ విషయమై ఎక్కువగా ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ కార్యాలయంలోని కొన్ని సెక్షన్‌లలో ఉన్న కింది స్థాయి అధికారులు తప్పులు చేసి ఫైల్స్ పంపించడం వల్ల కూడా కొన్ని ఫైల్స్ వెనక్కి వస్తున్నాయని, అంతేకాకుండా సెక్షన్లలో సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కూడా ఫైల్స్ ముందుకు జరగడం లేదన్న వాదన ఉంది. జిల్లాలోని 30 మండలాలకు చెందిన దాదాపు 600 ఫైచిలుకు ఫైల్స్ కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఫైల్స్ పూర్తి చేశారని, రైతులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 6 నెలలు పూర్తి అవుతున్నా 22ఏ, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ ఒక్క ఫైల్ కూడా పూర్తి చేయలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు గతంలో మూలనపడిపోయిన ఫైల్స్‌ను పూర్తి చేసి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి...

కలెక్టరేట్‌లో కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తాము. గతంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కూడా ఆదేశించారు. ఆ ఫైళ్లన్నీ కూడా త్వరగా పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాము.

- మధుసూదన్‌రావు, డీఆర్‌వో

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి



జిల్లా అధికారులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వారిపైన వెంటనే చర్యలు తీసుకునే విధంగా పరిపాలన ఉండాలి. ఫైల్స్ తప్పులు రాసి పంపిస్తే వారిపై కూడా యాక్షన్ తీసుకోవాలి. అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుంది. గత ప్రభుత్వంలో ఉన్న అధికారులు అందరు తమకు ఆదాయం వచ్చే ఫైళ్లను మాత్రమే కదిలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు కూడా ఫైల్స్ కదలడం లేదు. దూర ప్రాంతాల నుంచి రైతులు పదే పదే కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే ఎంత ప్రయాసో జిల్లా అధికారులు గుర్తించి వారి ఫైల్స్‌ను పూర్తి చేసి పంపాల్సిన బాధ్యత వారిపైన ఉంటుంది.

- సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను



రాజంపేట డివిజన్‌లోని పుల్లంపేట మండలం శ్రీనివాసపరంలో సర్వే నెంబర్-1215లో 2.60 ఎకరాలను గతంలో రిజిస్ట్రేషన్ కాకుండా ఆపేశారని అధికారులు చెప్పారు. అందువల్ల నేను ఏడాదికాలంగా కలెక్టర్ కార్యాలయంలో చాలాసార్లు అర్జీలు పెట్టాను. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులను అడిగితే వెళ్లి మీ తహసీల్దార్‌లను అడగండి అని చెబుతున్నారు. వారిని అడిగితే కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్లండి అని సలహా ఇస్తున్నారు. ఇలా ఒకరిపైన ఒకరు పెట్టుకుని ఏడాదికాలంగా నా ఫైలు చేయడం లేదు. నేను ఒక సామాన్య రైతుని. ప్రతిరోజూ కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే నాకు ఎంత శ్రమ ఉంటుంది. రెండు బస్సులు మారి రాయచోటికి రావాలి. ఎంత ఖర్చు వస్తుందో ఒకసారి మీరే ఆలోచన చేయండి.

- వెంకట్రామిరెడ్డి, పుల్లంపేట మండలం

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



సిద్దవటం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఓ ప్రేమజంట వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లెకు చెందిన మనోహర్ (26), కళాశ్రీ (24) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. మనోహర్ కడప ఎయిర్‌పోర్టులో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కళాశ్రీ కడప వివేకానంద కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వీరి వివాహానికి కుటుంబపెద్దలు అంగీకరించకపోవడంతో గురువారం ఉదయం 11 గంటలకు కడప-చెన్నై జాతీయ రహదారిలోని ఉమామహేశ్వర నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ వారు మేజర్లు కావడంతో, ఇరువురి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడగా మనోహర్ కుటుంబ సభ్యులు అంగీకరించారని, కళాశ్రీ కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నామని తెలిపారు.

నాటుసారా స్వాధీనం : ఇరువురి అరెస్టు

వాల్మీకిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారిపాళెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ ప్రాంతంపై ఈఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించి 30 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. గ్రామానికి చెందిన బి.శీన, జి.శంకరయ్య అనే వారిని అరెస్టు చేశారు. ఇరువురినిరిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. దాడులలో ఈఎస్‌టీఎఫ్ సీఐ యల్లయ్య, ఎస్ఐ శశిధర్, సిబ్బంది మోహన్‌రెడ్డి, వేమారెడ్డి, బాలకృష్ణ, విఘ్నేష్‌లు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు

- బిల్లుపైనే క్యూఆర్ కోడ్ ముద్రణ
- విద్యుత్ శాఖలో నూతన విధానం
- తొలి విడత కడప డివిజన్‌లో అమలు
- విజయవంతమైతే జిల్లా అంతటా...
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



సద్వినియోగం చేసుకోవాలి

క్యూఆర్ కోడ్‌తో బిల్లులు ఇస్తున్నాం. దీనిపై వినియోగదారులకు అవగాహన పెంచాం. బిల్లింగ్‌లో పారదర్శకత పెరుగుతుంది. స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులతో ఎటువంటి మోసాలకు ఆస్కారం ఉండదు. వినియోగదారులు సులువుగా చెల్లించుకోవచ్చు. బిల్లింగ్ లోపాలు ఉన్న సరిదిద్దుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరు వినియోగించుకోవాలి.

- ఎన్.హరి సేవ్యానాయక్, ఈఈ, కడప డివిజన్



కడప ఎర్రముక్కపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఆశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధా నం సత్ఫలితాలు ఇస్తుందని సంబంధిత అధికారులు చెబుతు న్నా రు. ఇది విజయవంతం అయితే జిల్లా వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుడతామన్నారు. నెలవారీ విద్యుత్ బిల్లుల చెల్లింపును ఏపీఎస్పీడీసీఎల్ మరింత సులభతరం చేసింది. ఇంటి వద్ద నుంచి బ్యాంకు ఖాతా ఫోన్ నెంబర్ అనుసంధానంగా ఉండే ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా చెల్లింపులు మరింత సులభతరం చేసేందుకు విద్యుత్ బిల్లులపైనే క్యూఆర్ కోడ్ ముద్రించింది. ప్రత్యేక డిజిటల్ విధా నాన్ని రూపొందించింది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సులువుగా బిల్లును చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు. జనవరి 1వ తేదీ నుంచి కడప డివిజన్ పరిధిలో ప్రారంభించారు. హెచ్‌టీ సర్వీసులకు మినహాయించి బకాయిలు లేని మిగిలిన సర్వీస్‌దారు లకు స్కాన్ ద్వారా బిల్లు కట్టే అవకాశాన్ని కల్పించారు.



బిల్లు చెల్లింపు కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రయోగాత్మకంగా..

కడప డివిజన్ పరిధిలో జనవరి 1 నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. కడప డివిజన్‌లో గృహ వినియోగదారులకు సంబంధించి 1,69,544 మీటర్లు, వాణిజ్య 23,793 మీటర్లు, పరిశ్రమల కోసం వినియోగించేవి 749 మీటర్లు, దేవాలయాలు, చర్చి, మసీదు, వీధి దీపాలు మంచినీటి పంపుల కోసం వినియోగించేవి 3818 మీటర్లు కలిపి మొత్తం 1,97,902 మీటర్లు ఉన్నాయి. అయితే గత ఏడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వెసులుబాటు ఉండేది. రిజర్వు బ్యాంకు ఆదేశాలతో విద్యుత్ సంస్థలు వాటి సేవలు నిలిపివేశాయి. ఈ పద్ధతిలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వినియోగదారులకు సులువుగా ఉండేది. ఆ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో సంస్థ ఖాతాలకు డబ్బు జమ అయ్యేది కాదు. దీని వల్ల డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చెల్లింపుల్లో జాప్యం కారణంగానే రిజర్వు బ్యాంకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతికి స్వస్తి చెప్పారు. ప్రత్యామ్నాయంగా పాత పద్ధతిలోనే మీ సేవా కేంద్రాలు, సంబంధిత సెక్షన్ కార్యాలయాలు, సంస్థకు చెందిన ఈస్ట్రన్ పవర్ యాప్‌లో చెల్లించేవారు. మీసేవా కేంద్రాల్లో అయితే సర్వీసు చార్జీ రూ.5చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు వినియోగదారునికి బిల్లులు అందిన వెంటనే చెల్లింపుల ప్రక్రియ వేగవంతమయ్యేలా క్యూఆర్ కోడ్‌ను విద్యుత్ సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. క్యూఆర్ కోడ్ విధానంలో చెల్లింపుల వల్ల పారదర్శకత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సౌత్‌ఇండియా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక



విద్యార్థి గౌరీశంకర్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

పులివెందుల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సౌత్‌ఇండియా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలకు చెందిన విద్యార్థి గౌరీశంకర్ తయారు చేసిన సీఓటూ ప్రాజెక్టు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో వ్యక్తిగత విభాగం కింద ఈ ప్రాజెక్టు ఎంపి కైందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆపడం వలన కార్బన్ డైఆక్సైడ్ (సీఓటు) వాయువు ఎక్కువగా విడుదలై వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇందుకు పరిష్కారంపై ఉపాధ్యాయులు సీవీ ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థి గౌరీశంకర్ ఈ ప్రాజెక్టును రూపొందించాడన్నారు. ఈ ప్రాజెక్టును ఈనెల 20 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో నిర్వహించే పోటీలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తల దాడి

వీరపునాయునిపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిదెన ఓబాయపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మందా శంకరయ్యపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో శంకరయ్యకు తీవ్ర గాయాలపాలయ్యాడు. కలందొడ్డిలోకి నీళ్లు పోతున్నాయని అడిగినందుకు కామనూరు ఈశ్వరయ్య, శంకరయ్య, సారయ్యలు కలిసి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై ఫిర్యాదు

సుండుపల్లె, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కలకడకు చెందిన మెహరాజ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో తనపై అసభ్యకరంగా పోస్టులు పెట్టాడని సుండుపల్లె మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీకి చెందిన నూరుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

భర్త హత్య కేసులో భార్యతో పాటు నలుగురికి జీవితఖైదు



నిందితులను చూపుతున్న పోలీసులు

మైలవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకు నేందుకు ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన కేసుకు సంబంధించి భార్యతో పాటు మరో నలుగురికి ప్రొద్దుటూరు రెండవ ఏడీజే కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. తొర్రివేముల గ్రామానికి చెందిన కుమ్మరి గురుప్రసాద్, కుమ్మర ప్రమీల దంపతులు. కాగా, అదే గ్రామానికి చెందిన తీట్ల సురేష్ అలియాస్ ఆటో సూరితో కుమ్మర ప్రమీల వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త అడ్డు తగులుతున్నాడని పథకం ప్రకారం హత్య చేసేందుకు కుట్ర పన్నారు. ఈ నేపథ్యంలో 2019 జనవరి 24వ తేదీ సమీప గ్రామమైన వేపరాలకు గురుప్రసాద్ బేల్దారి పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి తొర్రివేముల గ్రామానికి తిరిగి వస్తుండగా.. వేపరాల తొర్రివేముల గ్రామాల మధ్య ఉన్న బాబాసాబ్ బావి వంక వద్ద నిందితులు అతనిపై రాడ్లతో దాడి చేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మైలవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి నిందితులు కుమ్మర ప్రమీల, తీట్ల సురేష్ అలియాస్ ఆటో సూరి, కొమ్ము పెద్దిరాజు, చాకలి గురుస్వామి, మాదిగ ప్రతాప్‌లకు కోర్టు ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానాతో పాటు జీవితఖైదు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

91క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వేంపల్లె, జనవరి 9 (ఆంధ్ర జ్యో తి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఐచర్ వాహనంతో పాటు 91క్వింటాళ్ల రేషన్ బియ్యా న్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమ రవా ణా చేస్తున్నారన్న సమాచారం రావడంతో గురువారం తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్ తనిఖీ చేపట్టారు. చింతలమడుగుపల్లె-టి.వెలమవారిపల్లె గ్రామాల పొలాల మధ్య ఐచర్ వాహనంలో ఉన్న 177 మూటల రేషన్‌బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చంద్రమోహన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని.. బియ్యాన్ని గోడౌన్‌కు తరలించారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నాయకుల నారాయణ, శివన్న పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కడప క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం డీఈవో కార్యాలయ సమీపంలోని మురుగుకాల్వలో అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతదేహం లభించింది. స్థానికులు చిన్నచౌకు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మురుగుకాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. సిద్దవటం మండలం బోడిశెట్టిపల్లెకు చెందిన పోలుబోయిన నరసింహులు (33) కడప ఓంశాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఎంటెక్ పూర్తి చేసి కడపలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తల్లి వీరమ్మ సొంత ఊరికి పోవడంతో ఇంట్లో నరసింహులు ఒక్కడే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కాల్వలో మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఇతని మృతిపై పోలీసులు విచారిస్తున్నారు.

కరెంటు వైర్లు తగిలి యువకుడు...

కడప క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ సర్కిల్ సమీపంలో విద్యుత్‌వైర్లు తగిలి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజీవ్‌కుమార్ (23) మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. సంజీవ్ కుమార్ కడపలో రెండేళ్ల నుంచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ట్రాన్స్‌పోర్టు వెనుక భాగంలో పనిచేస్తున్న సమయంలో కరెంటు వైర్లు తగిలి మృతి చెందినట్లు తెలిపారు.

బ్రహ్మంసాగర్‌లో వృద్ధుడు..

బ్రహ్మంగారిమఠం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో గురువారం రామిరెడ్డి (78) అనే వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వీరపునాయునిపల్లె మండలం వెలుదుర్తి గ్రామానికి చెందిన రామిరెడ్డి ఇంటి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనానికి వెళుతున్నానని బ్రహ్మంగారిమఠంకు వచ్చి బ్రహ్మంసాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

లింగాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దొండ్లవాగు గ్రామానికి చెందిన గంగిరెడ్డి బాల గంగిరెడ్డి అనే రైతు గురువారం తన ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. బాల గంగిరెడ్డి తనకున్న పొలంలో శనగ పంట సాగు చేశాడు. ఇ-పంట నమోదు కోసం రైతు సేవా కేంద్రం సిబ్బందితో చర్చించి ఇ-పంటలో నమోదు చేయాలని కోరారు. తర్వాత ఏం జరిగిందో ఏమో పోలీసుస్టేషన్‌కు బాల గంగిరెడ్డిని పోలీసులు పిలిపించారు. స్టేషన్‌కు మరోసారి రావాలని చెప్పి పంపించడంతో ఆందోళనకు గురై బాలగంగిరెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఉపాధి పథకంలో ఖర్చు చేసింది రూ.8.48 కోట్లు

- అవినీతి జరిగింది రూ.36,350
- ఉపాధి సిబ్బందిపై అడిషనల్ పీడీ ఆగ్రహం
- తుమ్మలపల్లె ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ



ఉపాధి బహిరంగ సమావేశంలో పాల్గొన్న అధికారులు

బి.కోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గురువారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. 2023-24 సంవత్సరానికి రూ.8.48 కోట్లు ఖర్చు చేయగా అందులో అవినీతి రూ.36,350లు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డిలు హాజరయ్యారు. మండలంలో పది పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీ గురించి సామాజిక తనిఖీ బృందం జరిపిన పనులు, వాటి వివరాలు అవినీతి బహిర్గతం చేశారు. వీటిపై ఉపాధి సిబ్బంది పని తీరు సక్రమంగా లేదని అడిషనల్ పీడీ నాగరత్నమ్మ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తుమ్మలపల్లె ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణకు ఆదేశించారు. అలాగే పాయలకుంట్ల, మేకవారిపల్లె గ్రామ పంచాయతీల్లో పనులకు రాకున్నా మస్టర్లు వేయడం, ఒకరి బదులు మరొకరు పనిచేయడం, వారికి బిల్లులు చేయడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ భాస్కర్, ఏపీడీ ఆనంద్, ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీపీ చెన్నమ్మ, ఏపీవో రాజసాహెబ్, ఈసీ ఖాజా మరియు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఈ అవార్డు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

- కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి



విజేతలను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని పాలిటెక్నిక్ ఫెస్ట్‌లో రెండో బహుమతి గెలిచిన విద్యార్థుల విజయం విద్యార్థుల ప్రతిభకు సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనమని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. గవర్నమెంటు పాలిటెక్నిక్, కమలాపురం కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు మంగళవారం విజయవాడలో జరిగిన పాలిటెక్నిక్ ఫెస్ట్ 2024లో రెండో బహుమతి గెలుచుకుని కళాశాల పేరును రాష్ట్రస్థాయిలో వెలుగులోకి తెచ్చారన్నారు. గురువారం కళాశాలలో రాష్ట్రస్థాయిలో పాలిటెక్నికల్ కళా శాలను ద్వితీయ స్థానంలో నిలిపిన విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విజేతలను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ టెక్నోఫెస్ట్‌లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు శివకవిత, లావణ్య, ఈసీఈ రెండో సంవత్సరం విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభ కళాశాల గర్వించదగ్గది, వీరు రూపొందించిన డిస్పెన్సరీ ఫర్ ఎల్డర్లీ మెడికేషన్ అడ్రెస్ ప్రాజెక్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిందని ఆయన తెలిపారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు హోదా సభ్యులు పాల్గొని విజేతలను అభినందించారు.

గంగమ్మగుడి వేలం బకాయిలు రూ.8.67 లక్షలు

సికెదిన్నె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మగుడి తలనీలాలు, టెంకాయల వేలానికి సంబంధించి రూ.8,67,300 బకాయిలు ఉన్నట్లు ఈఓ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఈఓ బకాయిల వివరాలను పత్రికా విలేకరులకు వివరించారు. ఇందులో తలనీలాలకు సం బంధించి రూ.6,38,300 బకాయిలు ఉన్నాయన్నారు. 2015-16లో ఎస్.సాయి రూ.1.45లక్షలు, 2016-17లో జె.చిన్నశ్రీను రూ.95,500, 2017-18లో ఎస్.క్రిష్ణమూర్తి రూ.2,42,700, 2018-19లో పి.సుబ్బరాయుడు రూ.9600, 2020-21లో ఎం.పుల్లయ్య రూ.1,45,500 బకాయిలు ఉన్నారు. టెంకాయల వేలానికి సంబంధించి 2015-16లో బి.వి.రమణ రూ.30వేలు, 2021-22లో ఎస్.పాలకొండయ్య రూ.45వేలు, 2023-24లో ఇ.రామలక్ష్మిరెడ్డి రూ.1.54 లక్షలు మొత్తం రూ.2.29 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. వారికి నోటీసులు కూడా అందించామని ఈఓ తెలిపారు.

రూ.2.15 లక్షలు పలికిన తలనీలాల వేలం

గంగమ్మగుడి తలనీలాల వేలం రూ.2.15 లక్షలకు వెంకటరమణ దక్కించుకున్నట్లు ఈఓ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. గంగమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన టెండర్ల వేలంలో పెండ్లిమర్రి మండలానికి చెందిన రమణ వేలం దక్కించుకున్నాడన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు తలనీలాలు పోగుచేసుకునే హక్కు కలిగిఉంటారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇజితెమా..!

- చివరి రోజు లక్షలాదిగా తరలివచ్చిన ముస్లింలు



ఇజితెమాలో దువా చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు కేంద్రంగా మూడురోజుల పాటు జరిగిన ఉమూమి తబ్లిగీ ఇజితెమా గురువారం మధ్యాహ్నం ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు జరిగిన సామూహిక దువా కార్యక్రమానికి లక్షలాదిగా ముస్లింలు హాజరయ్యారు. ఇజితెమాలో జరిగే ఈ దువా కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రికే లక్షలాదిగా ముస్లింలు ఇజితెమా ప్రాంగణానికి చేరుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ఆ తర్వాత ముంబై, నిజామోద్దీన్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలతో పాటు ప్రపంచశాంతి, దేశ ఔన్నత్యం గురించి వివరించారు. సర్వమానవాళి సమానమేనని అందరి పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ, ఆప్యాయతను కలిగి ఉండాలని ఉపదేశించారు. మతాలకు అతీతంగా దేశ ఐక్యతను కాపాడుకుందామని ఉద్బోధించారు. ఆ తర్వాత 12.30 గంటల సమయంలో సామూహిక దువాను నిర్వహించిన అనంతరం మధ్యాహ్న నమాజ్‌ను పూర్తి చేసుకుని ఇజితెమా వేడుకలకు ముగింపు పలికారు. ఇదిలా వుంటే చివరి రోజు కూడా ఇజితెమాకు వచ్చిన వారికి నిర్వహణ కమిటీ వారు భారీ ఏర్పాట్లను కల్పించారు. వచ్చిన వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ సదుపాయం సమకూర్చారు. అదేక్రమంలో 17 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన సౌకర్యవంతమైన భోజన వసతిని కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి దాతలు ఇజితెమాకు వచ్చిన వారికి మజ్జిగ, పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సిద్ధం చేశారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. ఇజితెమా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల్లో కొనుగోళ్లు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇజితెమా కార్యక్రమాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లపై కమిటీని అభినందించారు.

వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


మదనపల్లెలో భోగిమంటలు వేస్తున్న మహిళలు


రామసముద్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, నాయకులు


పీలేరులోని ఇందిరమ్మ కాలనీ పాఠశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకలు

మదనపల్లె అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతీ స్కూల్‌లో విద్యార్థులతో భోగిమంటలు, రంగవల్లులు వేసి వేడుకలు జరుపుకున్నరు. ఈ వేడుకలను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించి ఉట్టిని కొట్టి సంతోషంగా గడిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి మన సాంప్రదాయాలు, కట్టుబాటులు, పండుగలు గుర్తుఉండేలా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి వారికి బహుమతులను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సేతు, టీడీపీ నాయకులు షంషీర్, నాగూర్‌వలి, జేసీబీ మధు, బాబా, హరి, రఘుపతినాయుడు, జేసీబీ వేణు పాల్గొన్నారు. స్థానిక ప్రశాంతనగర్‌లోని జ్ఞానోదయ స్కూల్‌లో ఆ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గులపోటీలు నిర్వహించారు. వారు వేసిన ముగ్గులను పరిశీలించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఆ పాఠశాల సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు.

రామసముద్రంలో: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్, స్కూల్ ఛైర్మన్ బాలాజి సాంప్రదాయం ఉట్టిపడేలా పంచెకట్టుతో వేడుకలలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సంబరాల్లో టీడీపీనేతలు చిన్నూస్వామి నాగరాజు, చొక్కాండ్లపల్లె రమణ, వీహిద్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాల కలయికే సంక్రాంతి

తంబళ్లపల్లె, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ, సంప్రదాయాల కలయికే సంక్రాంతి అని తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి చక్కగా వేసిన ముగ్గులను ఎంపికచేసి బహుమతులు అందచేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరు మండలంలోని అన్ని విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. పాఠశాలల్లో చిన్నారులకు హరిదాసు వేషధారణ గావించడమే కాకుండా భోగిమంటలు, గొబ్బిళ్లు, ముగ్గులు వేయించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పీలేరు ఇందిరమ్మ కాలనీలోని ప్రాథ మిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం విద్యాజ్యోతి హైస్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీ ల్లో విశేష ప్రతిభ చూపిన వారికి విద్యాజ్యోతి కరస్పాండెంట్ కుమార్, ప్రిన్సిపాల్ హసీనాలు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న పీపల్‌ట్రీ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లులతో చూడమచ్చటైన ముగ్గులు వేశారు. హరిదాసుల వేషధారణ చేసిన చిన్నారులు ఆకట్టుకున్నారు. సంక్రాంతి వేడుకలను తిలకించిన అతిథులు ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి పకడ్బందీ ఏర్పాట్లు

మదనపల్లె అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మదనపల్లెలో ఆలయాల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. గురువారం స్థానిక ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనానికి ఎంత లేదన్నా 50వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అధికారులు ముందస్తు భద్రత ఏర్పాట్లను పరిశీలించుకోవాలన్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం స్థలం ఎంపిక చేయాలన్నారు. 24గంటల పాటు పోలీసుల బందోబస్తు నియమించాలని, ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

● అనంతరం ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన నిమ్మనపల్లె మండలానికి చెందిన ఓ బాధితుల కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శిచారు. అనంతరం హౌసింగ్ పథకం కింద ఇంటి స్థలం మంజూరు చేసి నిధులు కేటాయించాలని ఆయన ఆదేశించారు.

గుర్రంకొండలో: వైకుంఠ ఏకాదశిని పురష్కరించుకున్ని మండ లంలోని పలు ఆలయాలు రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబవుతున్నాయి. ఇందులో భాగంగా తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారు శుక్రవారం రోజున ఉత్తర ద్వార దర్శనంలో కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నా రు. ఇందు కోసం ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లును చేశారు.

పెద్దతిప్పసముద్రంలో: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. మండలంలోని మల్లెల గ్రామం గొందిపల్లె కదిరిదేవర గుట్టపై వెలసిన కదిరి నరసింహస్వామి ఆలయంలో ఉదయం నుంచి విశేషపూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం వైకుంఠ ద్వారాన్ని తెరచి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. పీటీఎంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయం రంగసముద్రంలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించనున్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చండి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వాల్మీకులు

ములకలచెరువు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలని ఆర్‌వీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి బుర్రా రమణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాల న్నారు. వాల్మీకులు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో బీసీ జాబితాలో ఉండడం దురదృష్టకరమన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేవారు. ఈ కార్యక మంలో రాష్ట్ర జయింట్ సెక్రటరీ ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్, రాయలసీమ జిల్లాల మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రమీల, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మల్లెం అశోక్, నాయకులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : ఏపీలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితా లో చేర్చాలని కోరుతూ గురువారం స్థానిక మండల తహసీల్దార్‌కు జిల్లా వాల్మీకి సేవా సంఘం అధ్య క్షుడు మండ్ల జయశంకర్ ఆధ్వ ర్యంలో వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షు డు కూటమి ప్రభుత్వమైనా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరారు. వాల్మీకి నాయకులు యనమల రామచంద్ర, వెంకటేష్, మండ్ల రామకృష్ణ, గంగాధర్, సోమశే ఖర్, రాజు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత గౌనిపల్లెటీమ్

మదనపల్లె, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జరుగుతున్న సుకుమార్ మొమోరియల్ టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన కర్ణాటక రాష్ట్రం గౌనిపల్లెకు చెందిన నేతాజీటీమ్ విజేతగా నిలిచింది. విజేత టీమ్‌కు రూ.లక్ష, రన్నర్‌గా నిలిచిన గౌనిపల్లెకే చెందిన రైజింగ్ స్టార్ టీమ్‌కు రూ.50వేలు బహుమతిని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, టీడీపీ సీనియర్ నేత ఎస్‌ఏ.మస్తాన్ చేతుల మీదుగా అందజేశారు. మూడేళ్ల క్రితం మృతిచెందిన కేవీఆర్ టమోటా మండీ అధినేత సుకుమార్..జ్ఞాపకార్థం..స్థానిక టమోటా మండీ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో టీవీఎస్ బాబు(పృధ్విరాజ్), ఎస్‌ఎంబీ అల్తాఫ్, బావాజాన్ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మదనపల్లె, రాయచోటి, పీలేరు, వాల్మీకిపురం, రాయలపాడు, గౌనిపల్లె ప్రాంతాలకు చెందిన మొత్తం 30 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో మండీయజమానులు ప్యారేజాన్, సురేంద్ర, మౌలా, జాఫర్, రసీద్, రామలింగారెడ్డి, ఎస్.ఎ.ఖాదర్‌వలి, పెద్దసంఖ్యలో క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ వేలం పాట వాయిదా


అధికారులను ప్రశ్నిస్తున్న కూటమి నాయకుల

తంబళ్లపల్లె, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షే త్రమైన భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయ పనులకు సంబంధించి వివిధ హక్కులను పొందడానికి నిర్వహించ తలపెట్టిన వేలం పాట వాయిదా పడింది. గురువారం ఉదయం ఆలయ ఈవో మునిరాజ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లయ్యకొండ పైన బహిరంగ వేలం మొదలు పెట్టారు. వేలం పాటలో వాహనాల టోల్‌గేటు వసూలు హక్కు, తలనీలాలు సేకరించుకొను హక్కు, గౌరమ్మ ఆలయం, ఏనుగు మల్లమ్మ ఆలయం, వీరన్న గెవి వద్ద పూజాసామగ్రి విక్రయించుకొను హక్కు, దేవస్థానం వద్ద కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు, కొండ పైన దుకాణాలకు గేటు వసూలు హక్కు తదితర వాటిని దక్కించుకోవడానికి మండలం నుంచే కాకుండా ఉమ్మడి జిల్లా ల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆశావాహులు, భక్తులు తరలివచ్చారు. వారితో పాటుగా తంబళ్లపల్లె మండల టీడీపీ, జనసేన, కూటమి నాయకులు హాజరయ్యారు. ఈ క్రమంలో గత ఏడాది నిర్వహించిన వేలం పాటల ద్వారా వచ్చిన ఆదాయానికి జమా, ఖర్చుల వివరాలు తెలియచేయాలని కూటమి నాయకులు ఆలయ అధికారులను కోరారు. దీంతో ఈవో స్పందిస్తూ..తాను కొన్ని నెలల కిందట ఇక్కడ విధుల్లో చేరానని గత వేలంలో వచ్చిన ఆదాయానికి సంబంధించిన లెక్కల వివరాలన్నీ అపుడు ఉన్న ఈవో రికార్డులలో నమోదు చేశాడని సమాధానమిచ్చారు. దీంతో అప్పటి ఈవోనే వచ్చి జమా, ఖర్చుల వివరాలు తెలియచేసిన తర్వాతనే వేలం పాటలు నిర్వహించాలని కూటమి నాయకులు తేల్చి చెప్పడంతో ఈవో మునిరాజ వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వేలం నిర్వహించే తేదీ ని త్వరలోనే తెలియచేస్తామని ఈవో తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, మాజీ మల్లయ్య కొండ ఛైర్మన్ గంగులరెడ్డి, ఉత్తమ్‌రెడ్డి, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, చెరువుల సంఘం ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, బీజేపీ నేతలు లక్ష్మయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి'

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాల ని కాంగ్రెస్ పార్టీ డిమాండు చేసింది. పీలేరు నియోజకవర్గం ఇన్‌చార్జి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యం లో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపులబైలులోని ఇరిగేషన్ స్థలాన్ని కాపాడండి

పీలేరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పీలేరు-1 ఎంపీటీసీ సభ్యుడు కంభం నరసింహారెడ్డి మండల సమావేశంలో మాట్లాడుతూ వేపులబైలు పంచాయతీ పరిధిలోని సర్వే నెం.775, 801, 802లలో ఇరిగేషన్ శాఖకు చెందిన అర ఎకరా భూమిని కాపాడాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమను పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ కార్యక్రమాలను తమను ఆహ్వానించడం లేదని పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. వైస్‌ఎంపీపీ హరిత అధ్యక్షతన గురువారం పీలేరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేపులబైలు ఎంపీటీసీ గాయం మధుసూధన్ రెడ్డి, బాలంవారిపల్లె ఎంపీటీసీ దామోదర్, కాకులారంపల్లె సర్పంచ్ హరిణి అధికారుల తీరుపై మండిపడ్డారు. పీలేరు-2 ఎంపీటీసీ సభ్యుడు అమరనాథరెడ్డి మాట్లాడుతూ కడప మార్గంలో పనిచేసే లైన్‌మెన్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఎంపీటీసీలు, ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం


● ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ములకలచెరువు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం చేకూరుతుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ములకలచెరువులోని మైదానంలో టీఎస్‌ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు అధ్వర్యంలో జరుగుతున్న కట్టా క్రికెట్ టోర్నమెంటును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంటును ప్రారంభం సందర్భంగా బ్యాటింగ్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అలాగే ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు తలారీ మంజునాథ్, కేశవులు, ప్రతాప్, ఆర్గనైజర్లు కట్టా విజయ్‌నాయుడు, యుగంధర్, ఇర్ఫాన్, సాధిక్, వెంకీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బి.కొత్తకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రేనాటి వీరుడు, స్వాతంత్ర్యసమర యోధుడు అయిన ఒడ్డెర ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో వడ్డెరసంఘ నాయకులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమేరకు స్థానిక జ్యోతిసర్కిల్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ నిర్ణయాన్ని యావత్ వడ్డెరసంఘం స్వాగతిస్తోందన్నారు. కార్యక్రమంలో వడ్డెరసంఘం జిల్లా అధ్యక్షుడు దేరంగులనారాయణ, తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు నాగమల్లప్ప, మండల అధ్యక్షుడు తమ్మిశెట్టిపద్మనాభం, చౌడప్ప, నాగరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు గరుడారెడ్డి మృతి



కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కలికిరి పట్టణం రామ్‌నగర్ కాలనీకి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు నారే గరుడా రెడ్డి (75) గురువారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కలికిరిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు అడ్వకేటు రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



రామసముద్రం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 600 మంది విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. మండలంలోని చెంబకూరు, రామసముద్రం, కేసీపల్లె, అరికెల, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ మెటీరియల్ అందజేశారు. ఇందులో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి 300 మంది విద్యార్థులకు మండల ఎస్టీయూ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ 200మంది విద్యార్థులకు జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ 50మందికి అరికెల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మధుసూదన్, 50 మందికి తమ సొంత నిధులతో ఈ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు చిట్టిబాబు, విష్ణుప్రియ, బాలసుబ్రహ్మణ్యం, మునిస్వామినాయక్, మస్తాన్ బీ, జనార్దన్‌రెడ్డి, గురునాథం, మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రమాదేవి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో కచ్చితమైన భూ కొలతలు

నిమ్మనపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రీసర్వే ద్వారా కచ్చితమూ భూకొలతలు సాధ్యమని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. గురువారం రాచవేటివారిపల్లి పంచాయతిలో రీసర్వేపై గ్రామస్థులకు అవగాహన చేపట్టి ర్యాలీ నిర్వహంచారు. 1750ఎకరాల 1సెంటు భూమి ఉండగా దానిపై ఈ నెల 20నుంచి రీసర్వే జరగుతుందని తెలిపారు. ఈ సర్వేకు 4టీమ్‌లు ఏర్పడి సర్వే నిర్వహిస్తారని సంభందిత రైతులు సర్వే అధికారులు వచ్చినప్పుడు వారి భూమి పత్రాలతో భూమి వద్దే అందుబాటులో ఉండి రీసర్వే చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఘనంగా టీడీపీ నేత జన్మదిన వేడుకలు

మదనపల్లె అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రధాన అనుచరుడు నాగూర్‌వలి(షో ఆఫ్ శ్రీనా) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి నాయకులు పంచిపెట్టారు. పలువురు కూటమినాయకులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మన్, నాదేళ్ల విద్యాసాగర్, షంషీర్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం, ప్రభాకర్, కౌన్సిలర్ తులసీ రామకృష్ణ, ఆర్‌జే వెంకటేష్, కమలామరికృష్ణ, నవీన్ చౌదరి, సుధాకర్, గిరీష్‌కుమార్, సహదేవనాయుడు, జనసేన నాయకురాలు దారం అనితా, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మరకుంట సచివాలయం తనిఖీ


తుమ్మరకుంట సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్దతిప్పసముద్రం జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మరకుంట సచివాలయాన్ని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బంది వివరాలు హాజరు రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న సర్వే పనులను ఆయన పరిశీలించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో అందచేస్తున్న పెన్షన్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

జీవో నెం.117 రద్దు శుభపరిణామం

పీలేరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో నెం.117ను రద్దు చేయడం రాష్ట్ర విద్యారంగానికి శుభపరిణామమని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేశ్ పేర్కొన్నారు. పీలేరులో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆ జీవో కారణంగా విద్యావ్యవస్థ నిర్వీర్యమైపోతుందని తాము ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు తెలియజేయడంతో ఆయన స్పందించి దానిని రద్దు చేశారన్నారు. ఆ జీవో రద్దు ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థ మళ్లీ గాడిలో పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ అసోసియేషన్ తరపున నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఈవో వైఖరి నిరసిస్తూ ప్రజాసంఘాల ఆందోళన

పీలేరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ పంచాయతీ ఈవో గురుమోహన్ వ్యవహారశైలి మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పీలేరులోని పలు ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకుడు తుమ్మల ధరణీ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వెంకటరమణ అనే వ్యక్తిపై ఈవో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాషలాడారని ఆరోపించారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి వారిని స్టేషన్‌కు తరలించారు.

సాంకేతిక అంశాలపై పట్టుసాధించాలి

మదనపల్లె టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి సిబ్బంది సాంకేతిక అంశాలపై పట్టుసాధించాలని డ్వామా ఏపీడీ మధుబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనం వద్ద కొత్తగా ఎంపికైన ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో ఏపీడీ మాట్లాడుతూ పారంపాండ్స్ నిర్మాణాలు, ఉద్యాన పంటల మొక్కల చుట్టు కందకాలు తవ్వడం, వాటి కొలతలు తీయడం పనులు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ చందన, మదనపల్లె, నిమ్మనపల్లె ఏపీవోలు సుబ్రమణ్యం, వెంకటేశ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

రామసముద్రం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 6న చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సలు ఈనెల 8వ తేదీతో ముగిసినట్లు తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. ఈరెవెన్యూ సదస్సులలో మొత్తం 424 దరఖాస్తులు రాగా వాటిలో 68దరఖాస్తులకు సదస్సులలోనే శాశ్వత పరిష్కారం అందించినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులలో కొన్ని సమస్యాత్మకమైనవి కావడంతో వాటిని పరిష్కరించడానికి కొంత సమయం పడుతుందన్నారు. అలాగే ఈ నెల 20న నారిగానిపల్లెలో భూముల రీసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.